ప్రజాపక్షం

జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్

ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

గురువారం | 03 జులై, 2025 | పేజీలు :08


# కస్తూర్బా పాఠశాలలో అటెండర్ పోస్ట్‌కు దరఖాస్తులకు ఆహ్వానం

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో అటెండర్ (సబార్డినేట్) పోస్ట్ ఖాళీగా ఉన్నందున పూర్తిస్థాయిలో కాంటాక్ట్ ప్రతిపాదికన అర్హులైన మహిళ నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఎంఈఓ హరిప్రసాద్ తెలిపారు. దరఖాస్తులను స్వీకరించడానికి త్రిసభ్య కమిటీ సభ్యులైన తహాశీల్దార్ మధుసూదన్ రెడ్డి, ఎంపీడీవో సురేష్, మండల విద్యాధికారి హరిప్రసాద్ లను ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈనెల నాలుగో తేదీ నుండి 14వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించబడతాయని ఈ అటెండర్ పోస్టు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు మండలంలో నివసించే మహిళలు 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని అలాగే 18 సంవత్సరాల పైబడిన వయసు కలిగిన వారు ఈ పోస్టుకు అర్హులన్నారు. దరఖాస్తు చేసుకునే మహిళ అభ్యర్థులు బయోడేటా తో పాటు పదో తరగతి సర్టిఫికెట్ ఒరిజినల్, స్టడీస్ సర్టిఫికెట్, కులం, నివాసం తోపాటు ఆధార్ కార్డు జతపరిచి కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు తమ దరఖాస్తులను అందించాలని మండల విద్యాధికారి తెలిపారు.

## వర్షాకాలం పారిశుధ్య నిర్వహణ పట్ల

# అప్రమత్తంగా ఉండాలి



### కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** వర్షాకాలం పారిశుధ్య నిర్వహణ పట్ల పట్టణాలలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో పెద్దపల్లి, సుల్తానాబాద్ మున్సిపాలిటీ లు పని తీరు పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. పట్టణాలలో చేపట్టిన అభివృద్ధి పనులు, పారిశుధ్య నిర్వహణ, త్రాగు నీటి సరఫరా, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ వసూలు, వన్ మహోత్సవం సంబంధిత అంశాల పై కలెక్టర్ చర్చించి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణాలలోటి.యూ.ఎఫ్.ఐ.డి.సి ద్వారా చేపట్టిన అంతర్గత రోడ్డు, డ్రైయిన్ నిర్మాణ పనులను నిర్ణిత గడువు లోగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. సుల్తానాబాద్ పట్టణంలో ప్రతి రోజూ త్రాగు నీటి సరఫరా చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అన్నారు. పట్టణాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలకు ఎప్పటికప్పుడు చెల్లింపులు చేయాలని కలెక్టర్ తెలిపారు.ప్రతి వార్డు పరిధిలో పారిశుధ్య నిర్వహణ, ఇంటింటి నుంచి చెత్త సేకరణ కు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అన్నారు. పారిశుధ్య పనులను రెగ్యులర్ గా మానిటరింగ్ చేయాలని, రోడ్డు మీద చెత్త, ప్లాస్టిక్ ఉండటానికి వీలు లేదని అన్నారు. ప్రతి రోజూ ఉదయం పారిశుధ్య కార్మికుల పని తీరు మున్సిపల్ అధికారులు తనిఖీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.జూలై నెలాఖరు వరకు సుల్తానాబాద్ పట్టణంలో డంప్ యార్డ్ సమస్య పరిష్కారం చేయాలని అన్నారు. సుల్తానాబాద్ పట్టణంలో పని చేయని పారిశుధ్య కాంట్రాక్టర్ లను తొలగించాలని అన్నారు. రోడ్ల పై చిత్త వేయకుండా వాణిజ్య వ్యాపారులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు జూలై 15 నాటికి రోడ్డు పై ఎక్కడా చెత్త, ప్లాస్టిక్ ఉండకూడదని అన్నారు. పబ్లిక్ టాయిలెట్స్ శుభ్రంగా మేయింటేన్ చేయాలని అన్నారు. మార్కెట్, పెట్రోల్ బంక్ వద్ద పబ్లిక్ టాయిలెట్స్ ఉండాలని అన్నారు. పబ్లిక్ ప్రదేశాలో చెత్త వేస్తే భారీ జరిమానా విధించాలని కలెక్టర్ సూచించారు. రోడ్ల పై నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, గుంతలను పూర్తి స్థాయిలో పూడ్చివేయాలని అన్నారు. వన మహోత్సవం కార్యక్రమం క్రింద పట్టణాలలో గ్రీనరి పెంచాలని, అవెన్యూ ప్లాంటేషన్ క్రింద 2 మీటర్ల కంటే ఎత్తైన మొక్కలు నాటి, వాటి సంరక్షణకు ట్రీ గార్డ్ కర్ర మొదలైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. పెద్దపల్లి పట్టణంలో చేపట్టిన సమీకృత వెజ్ నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని అన్నారు.మురికి కాల్వలో చెత్త వేసే వారిని గుర్తించేందుకు వార్డు అధికారులు చర్యలు తీసుకోవాలని, మున్సిపల్ యంత్రాంగంతో సహకరించకుండా అపరిశుభ్రత వ్యాప్తి చేసే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని అన్నారు. పట్టణాలలో ఎక్కడా అక్రమ నిర్మాణాలు జర్గడానికి వీలు లేదని, మన అనుమతులకు లోబడి నిర్మాణాలు జరుగుతున్నాయో లేదో రెగ్యులర్ గా చెక్ చేయాలని అన్నారు.పట్టణాలలోని రెసిడెన్షియల్ హాస్టల్స్, ప్రభుత్వ పాఠశాలల్లో త్రాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనవసరమైన చెత్త ఉండకుండా చూడాలని అన్నారు. పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన పథకం పై విస్తృత ప్రచారం కల్పించి పట్టణంలో 300 ఇండ్లలో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు లక్ష్యంగా పని చేయాలని అన్నారు. పాఠశాలలు, హస్టల్స్ లో కూడా సోలార్ ప్యానెల్ ఏర్పాటు ప్రతిపాదనలు అందించాలని అన్నారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం

# వేగవంతం చేయాలి

### గుమ్లాపూర్‌లో ఇండ్ల నిర్మాణాన్ని పరిశీలించిన కలెక్టర్ పమేలా సత్పతి

**ప్రజాపక్షం/చొప్పదండి:** చొప్పదండి మండలం గుమ్లాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు. లబ్దిదారు సామల విజయ నిర్మించుకుంటున్న ఇంటిని పరిశీలించి ఆమెతో మాట్లాడారు. ఇంటి నిర్మాణంలో ఏమైనా సమస్యలున్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. నిర్మాణం వేగవంతం చేయాలని, దశలవారీగా ప్రభుత్వం తరపున సొమ్ము జమ చేస్తామని తెలిపారు. లబ్దిదారు సామల విజయ స్వయం సహాయక సంఘం సభ్యురాలు అయి ఉండి 5వ తరగతి వరకు చదువుకున్నందున ఓపెన్ స్కూల్‌లో పదవ తరగతికి అడ్మిషన్ తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. గ్రామంలో మంజూరైన ఇండ్లకు సంబంధించి వంద శాతం బేస్‌మెంట్ లెవల్‌కు చేరాలని హౌజింగ్ అధికారులను, ఎంపిడివోను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిడివో వేణుగోపాల్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, హౌజింగ్ ఏఈ సుప్రియ పాల్గొన్నారు.

**గుమ్లాపూర్ పిహెచ్‌సిని సందర్శించిన కలెక్టర్**

చొప్పదండి మండలం గుమ్లాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి బుధవారం సందర్శించారు. ఓపి రికార్డును తనిఖీ చేశారు. ఆయుష్మాన్ భారత్ రిజిస్ట్రేషన్లు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేవారు. ఈ సంధర్భంగా వైద్య సిబ్బందితో మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగుల ఆధార్, ఫోన్ నెంబర్ సేకరించి నూరు శాతం ఆయుష్మాన్ భారత్‌లో రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలన్నారు. బిపి, షుగర్ వ్యాధిగ్రస్తులకు అవసరమైన మాత్రలు నిరంతరం అందుబాటులో ఉంచాలన్నారు. మహిళలకు మల్టీ విటమిన్ టాబ్లెట్లు, క్యాల్షియం ఐరన్ మాత్రలు ఇవ్వాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఆరోగ్య మహిళ ఉచిత వైద్య పరీక్షల బోర్డును కేంద్రంలో ప్రదర్శించాలని సూచించారు. శుక్రవారం సభలో సేకరిస్తున్న గ్రామస్తుల ఆరోగ్య వివరాలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రదర్శించాలన్నారు. ఆసుపత్రి ఆవరణలో ఖాళీ స్థలం ఎక్కువగా ఉన్నందున వన మహోత్సవంలో విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి సాజిత, కో ఆర్డినేటర్ సనా పాల్గొన్నారు.



## బాలల హక్కులను కాపాడటం

# ప్రతి ఒక్కరి బాధ్యత



### కలెక్టర్ కుమార్ దీపక్

**ప్రజాపక్షం/మంచిర్యాల :** బాలల హక్కులను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. జిల్లాలోని కలెక్టర్ సమావేశ మందిరంలో సంక్షేమ శాఖల అధికారులు, పోలీసు, కార్మిక, విద్య, వైద్య ఆరోగ్యశాఖల అధికారులతో ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాల అమలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బాలల హక్కులను కాపాడి వారికి మంచి భవిష్యత్‌ను అందించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా తీసుకోవాలని తెలిపారు. 202526 విద్యా సంవత్సరంలో పాఠశాలలు ప్రారంభమైన బడి మానివేసిన పిల్లలు, మధ్యలో బడి మానివేసిన పిల్లలు, బాల కార్మికులను గుర్తించి పాఠశాలలో తిరిగి చేర్పించాలని తెలిపారు. కార్మిక శాఖల అధికారుల బృంద సంభ్యులతో కలిసి పరిశ్రమలు, దుకాణాలు, నిర్మాణ ప్రాంతాలు ఇతర ప్రదేశాలను సందర్శించి బాల కార్మికులను గుర్తించాలని 14 సంవత్సరాల లోపు వయసు కలిగిన బాలకార్మికలు పని చేస్తున్నట్లుగా గుర్తించినట్లయితే సంబంధిత సంస్థల యాజమాన్యంపై కేసు నమోదు చేసి బాధిత బాలలకు నష్టపరిహారం అందించాలని తెలిపారు. బాల్య వివాహాలను నిర్మూలించే దిశగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని, బాల్య వివాహాల వలన కలిగే నష్టాలను ప్రజలకు అవగాహణ కల్పించాలని తెలిపారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లయితే తెలిస్తే సంబంధిత అధికారులు, 1098, 100 నంబర్లలో తెలియజేయవచ్చని , సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిడబ్ల్యుసి ఛైర్మన్ వహిద్, జిల్లా సంక్షేమశాఖ అధికారి రౌఫ్‌ఖాన్, జిల్లా షెడ్యూల్ కులముల అభివృద్ధి అధికారి సిహెచ్ దుర్గాప్రసాద్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఎ.పురుషోత్తం, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి నీరటి రాజేశ్వరి, జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య, బెల్లంపల్లి, జైపూర్ ఎసిపిలు రవికుమార్, వెంకటేశ్వర్లు, బాలల పరిరక్షణ కమిటి అధికారి ఆనంద్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# విద్యుత్ స్థంభాన్ని ఢీ కొన్న ఆర్‌టిసి బస్సు

**పరజాపక్షం/గంగాధర:** గంగాధర మండలం మధురానగర్ బస్టాండ్‌లో బుధవారం తృటిలో పెను ప్రమాదం తప్పింది. కోరుట్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు గంగాధర బస్టాండ్ నుంచి బయలుదేరే సమయంలో విద్యుత్ స్థంభాన్ని ఢీకొంది. దీంతో కరెంటు పోల్ విరిగి తీగలు తెగి బస్సుపై పడడంతో వెంటనే అప్రమత్తమైన బస్సు డ్రైవర్, స్థానికులు విద్యుత్ శాఖ సిబ్బందికి సమాచారం అందిచడంతో వెంటనే కరెంటు సరఫరాను నిలిపివేశారు. దీంతో పెను ప్రమాదం తప్పడంతో ప్రయాణికులు, ఆర్టీసీ అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. ఘటన జరిగిన సమయంలో బస్సులో డ్రైవర్, కండక్టర్‌తో పాటు 34 మంది ప్రయాణికులున్నారు. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని ప్రయాణికులు అభిప్రాయం వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ అధికారులు మరమ్మత్తులు చేసి విద్యుత్ పునరుద్ధరించారు. ఈ ఘటనపై సంబంధిత అధికారులు విచారణ చేపట్టినట్లు సమాచారం.




## ఇండోర్ తరహాలో కరీంనగర్ డంప్‌యార్డు సమస్య పరిష్కారం

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, డంపు యార్డు సమస్య పరిష్కారంలో భారతదేశంలోనే ముందుండి మంచి పేరు సంపాదించుకున్న ఇండోర్ తరహాలోనే కరీంనగర్ డంప్ యార్డు సమస్య పరిష్కరించేందుకు తాను ముందుండి కార్యచరణ రూపొందిస్తానని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జి వెలిచాల రాజేందర్ రావు తెలిపారు. నగర శివారులో డంపు యార్డు సమస్య చాలా తీవ్రంగా ఉందని, ప్రజలు శ్వాసకోశ క్యాన్సర్ ఇతర వ్యాధుల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం సాయంత్రం కరీంనగర్ శివారులోని బైపాస్ రోడ్‌లో ఉన్న డంపు యార్డును వెలిచాల రాజేందర్ రావు కాంగ్రెస్ నాయకులు, స్థానికులతో కలిసి పరిశీలించారు. ట్రాక్టర్‌లో వెళ్లి డంప్ యార్డు పరిస్థితిని క్షుణ్ణంగా పర్యవేక్షించారు. అనంతరం మాట్లాడుతూ కరీంనగర్ డంప్ యార్డు సమస్య ప్రజల ఆవేదన కాదని, ఇది తన ఆవేదనగా చెప్పుకొచ్చారు. ఇండోర్‌లో జిల్లావాసి మున్సిపల్ కమిషనర్‌ఘా పనిచేశారని, ఆయన డంప్ యార్డు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ శానిటేషన్ విషయంలో అనేక వినూత్న కార్యక్రమాలు చేపట్టి ఇండోర్‌ను దేశంలోనే ఆదర్శ నగరంగా తీర్చిదిద్దారని చెప్పారు. ప్రస్తుతం ఆయన భోపాల్‌లో హెల్త్ సెక్రటరీగా పనిచేస్తున్నారని, కరీంనగర్ డంపు యార్డు సమస్యపై ఇటీవల ఆయనతో మాటాడడం జరిగిందన్నారు. గత 20 సంవత్సరాల నుంచి ఇండోర్ నగరం భారతదేశంలోనే అత్యుత్తమ నగరంగా అవార్డులు సాధిస్తున్నదని పేర్కొన్నారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, డంప్ యార్డు సమస్య పరిష్కారానికి ఇండోర్‌లో చేపట్టిన వినూత్న కార్యక్రమాలు కరీంనగర్‌లో అవగాహన కల్పించేందుకు రెండు రోజుల పాటు సెమినార్ నిర్వహిస్తామని, ఇందుకు ఆయనను ప్రత్యేకంగా ఆహ్వానించానని తెలిపారు. నరహరి సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. ఈ సెమినార్‌కు జిల్లా ఉన్నతాధికారులను ఆహ్వానిస్తామని చెప్పారు. అందుకు సంబంధించిన నిపుణుల బృందాన్ని సైతం తీసుకొస్తానని తెలిపారు. డంపు యార్డు సమస్య పరిష్కారానికి తగిన బడ్జెట్ కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించే బాధ్యత తీసుకుంటానని తెలిపారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను కేంద్రం నుంచి నిధులు ఇప్పించాలని కోరుతానని తెలిపారు. గత బిఆర్ఎస్ పాలకులు స్మార్ట్ సిటీ పేరిట కోట్లాది రూపాయలు దుర్వినియోగం చేశారని, కరీంనగర్‌ను కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వైద్యుల అంజన్ కుమార్, కట్ల సతీష్, పడిశెట్టి భూమయ్య, ఆకుల నరసన్న, గంట శ్రీనివాస్ ,తుమ్మనపల్లి శ్రీనివాసరావు, కర్ర రాజశేఖర్, కోటగిరి భూమాగౌడ్, గడ్డం విలాస్ రెడ్డి, మడుపు మోహన్, సిరాజ్ హుస్సేన్, కంకణాల అనిల్ కుమార్, ముద్దసాని క్రాంతి, ఆకుల ఉదయ్, దొంతి గోపి, శ్రావణ్ నాయక్, బత్తిని చంద్రయ్య, గడ్డం శ్రీరాములు, బొమ్మ ఈశ్వర్ ,బోనాల మురళి, స్థానికులు మంగ, శ్రీనివాస్ తదితరులున్నారు.

## పదవీ విరమణ జీవితంలో కీలకమైన ఘట్టం



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** పదవీ విరమణ జీవితంలో చాలా కీలకమైన ఘట్టమని తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ కరీంనగర్ జిల్లా చైర్మన్, టిఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం జిల్లాలోని ఎల్ఎండిలోగల నీటిపారుదల శాఖలో ఇంజనీర్ ఇన్ చీఫ్ (పరిపాలన విభాగపు అధికారి)గా సుదీర్ఘంగా పనిచేస్తున్న బూరం శంకర్ పదవీ విరమణ పొందారు. ఈ మేరకు ఇంజనీర్ ఇన్ ఛీఫ్ మధుసూధన్ రావు అధ్యక్షతన పదవీ విరమణ మహోత్సవ కార్యక్రమం నిర్వహించగా ముఖ్య అతిధిగా తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ కరీంనగర్ జిల్లా చైర్మన్, టిఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావులు హాజరై సంఘ నాయకులు, ఉద్యోగుల సమక్షంలో శంకర్‌కు బొకే శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈసంధర్బంగా దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ 30 నుంచి 40 సంవత్సరాల పాటు ప్రభుత్వరంగంలో సేవలందించడం చాలా గొప్ప విషయమని, జీవితంలో ఒక ముఖ్యమైన భాగంగా ముగిసి మరో అంకం ప్రారంభమవుతుందన్నారు. ఎలాంటి సస్పెన్షన్, అవినీతి ఆరోపణలు లేకుండా పదవీ విరమణ పొందడం ఆయన వృత్తికి తీసుకొచ్చిన గౌరవం అన్నారు. కార్యక్రమంలో రాగి శ్రీనివాస్, రామచంద్రారెడ్డి, వెంకటేశ్వర్ రావు, మామిడి రమేష్, ప్రభాకర్, గంగారపు రమేష్, రవీందర్ రెడ్డి, సందీప్ రావు, అస్గర్, కయ్యం శ్రీనివాస్, హరికృష్ణ, యోగేందర్ తదితరులున్నారు.

## వర్షాలు కురవాలని గ్రామ దేవతలకు పూజలు



**ప్రజాపక్షం/చొప్పదండి:** సకాలంలో వర్షాలు కురిసి సమృద్ధిగా పంటలు పండాలని చొప్పదండి పట్టణంలోని శివకేశవ రైతు సంఘం ఆద్వర్యంలో గ్రామ దేవతలకు పూజలు చేశారు. ఈ సంధర్బంగా రైతు సంఘం సభ్యులు డప్పు చప్పుళ్లతో చొప్పదండి పట్టణంలోని అన్ని దేవస్థానాలలో కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. సమృద్ధిగా వర్షాలు పడడంతో పాటు పాడిపంటలకు ఎలాంటి ఆటంకం లేకుండా దిగుబడులు వచ్చేలా దేవతలు చల్లగా చూడాలని ప్రతి ఏడాది రైతు సంఘం ఆద్వర్యంలో పట్టణంలోని గ్రామ, కుల, ఇతర అన్ని ఆలయాలలో పూజలు చేస్తున్నట్లు సంఘం సభ్యులు తెలిపారు. అనంతరం రైతులు ఒకేచోట వన భోజనాలు చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షుడు బొడిగె శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శి అమరగొండ భీరయ్య, క్యాషియర్ పిట్టల భూమయ్య, అమరగొండ శ్రీనివాస్, పెద్దమనుషులు పెద్ది రవి, గనివేని కుమార్, చేపూరి శ్రీను, అమరగొండ సురేష్, పెద్ది ఆశాలు, పిట్టల నర్సయ్య, పొన్నం వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అధికారంలో ఎక్కడికక్కడ నిలిచిన నగర అభివృద్ధి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** అసంపూర్తిగా ఉన్న పెండింగ్ అభివృద్ధి పనులు, ప్రస్తుతం నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోరుతూ మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు ఆద్వర్యంలో బిజెపి నాయకులు బుధవారం జిల్లా కలెక్టర్, నగరపాలక సంస్థ స్పెషల్ ఆఫీసర్ పమేలా సత్పతిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సంధర్బంగా మాజీ మేయర్ సునీల్‌రావు మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నగరపాలక సంస్థ పరిధిలో ఎలాంటి అభివృద్ధి పనులు జరగడం లేదన్నారు. ఇప్పటి వరకు నగరపాలక సంస్థకు ఒక్క రూపాయి నిధులు విడుదల కాలేదని మండిపడ్డారు. నగరవ్యాప్తంగా అభివృద్ధి ఎక్కడికక్కడ నిలిచిపోయిందన్నారు. గత ఆరేళ్ల కాలంలో నగరంలో ఏమైనా అభివృద్ధి పనులు జరిగాయంటే అవి కేవలం కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులతో మాత్రమేన్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కేంద్రం నుంచి రూ.800 కోట్లు విడుదల చేయించడంతోనే స్మార్ట్ సిటీలో నగరం అభివృద్ధి చెందిందన్నారు. అమృత్ 1.2 పథకం ద్వారా రూ.279 కోట్లతో త్రాగు నీటి పనులు, 15 ఫైనాన్స్ రూ.100 కోట్ల నిధులతో పెద్ద ఎత్తున పనులు చేపట్టడం జరిగిందన్నారు. గత ఆరేళ్లలో అప్పటి అధికారంలో ఉన్న ప్రభుత్వం, ఇప్పుడు అధికారంలో ఉన్న ప్రభుత్వం నగరపాలక సంస్థ అభివృద్ధి కోసం రూపాయి ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. 5 లక్షల జనాభా ఉన్న నగరాన్ని పెంచుకుంటూ పోయి ప్రభుత్వం ఎలాంటి సహకారం అందించకుండా ఏవిధంగా అభివృద్ధి కొనసాగుతుందని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలు వారి నియోజకవర్గాల్లో పనులు, రాజకీయాలు తప్ప కరీంనగర్‌ను పట్టించుకునే నాథుడే లేడన్నారు. అధికారులు స్పందించి వెంటనే అసంపూర్తి, పెండింగ్ పనులు, నగర సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బిజెపి మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జిల్లా వ్యాప్తంగా టిఆర్ఎస్(డి) కమిటీలు



**ప్రజాపక్షం/కరీంనగర్:** జిల్లా వ్యాప్తంగా టిఆర్ఎస్(డి) జిల్లా కమిటీలు, మండల కమిటీలు, గ్రామ కమిటీలు వేయడం జరుగుతుందని తెలంగాణ రక్షణ సమితి(డెమోక్రటిక్) పార్టీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు నేరెళ్ల జైపాల్ గౌడ్ తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడం జరుగుతుందన్నారు. టిఆర్ఎస్‌డిలో చేరి వారి ఉజ్వల రాజకీయ భవిష్యత్తుకు పునాది వేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ అధ్యక్షులు నరాల సత్యనారాయణ, జిల్లా ఇంచార్జి తోడేటి శంకర్ గౌడ్ ఆదేశాల మేరకు రానున్న వారం రోజుల్లో అన్ని కమిటీలు పూర్తి చేస్తామని అన్నారు. గురువారం హైదరాబాద్‌లో జరిగే పార్టీ ప్లీనరీ సమావేశానికి ముఖ్య నాయకులందరూ హాజరు కావాలని, ఈ సమావేశంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రకటన ఉంటుందని తెలిపారు.

## ఘనంగా దారి మైసమ్మ కొలుపు

**ప్రజాపక్షం/ముత్తారం :** ముత్తారం మండల కేంద్రంలోని ట్రాలీ యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా దారి మైసమ్మ కొలువు కొలిచారు. మండల పరిధిలోని 80 ట్రాలీ యజమానులు బుధవారం దారి మైసమ్మ ఆలయం రోడ్డు ఒకవైపు పొదుగుతా వాళ్ల వాహనాలు అవి వారు నడిపే ఆటో ట్రాలీ లతో ఎటువంటి రోడ్డు ప్రమాదాలు జరగవద్దని దారి మైసమ్మకు ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఏటా ఇదే విధంగా అందరూ కలిసి కట్టుగా దారి మైసమ్మకు పూజలు నిర్వహిస్తామని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు అల్లం దేవేందర్,ఉపాధ్యక్షులు రాగుల మొగిళి, ప్రధాన కార్యదర్శులు కోళ్ల శ్రీనివాస్, దుర్చేటి కుమార స్వామి, సభ్యులు పెండెం గణేష్, కళ్యాణపు ఉమామహేష్, అమ్ము లక్ష్మన్, నరెడ్ల శ్రీనువాస్, నాయిని సంపత్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక అక్షరాస్యత పై అవగాహన

**ప్రజాపక్షం/ముత్తారం :** ముత్తారం మండలంలోని అడవిశ్రీరాంపూర్ గ్రామ పంచాయతీలో ఆర్థిక అక్షరాస్యత డిజిటల్ గ్రామ పంచాయతీ ఏర్పాటు కొరకు అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరికీ బ్యాంకు ఖాతా ఉండాలని, ప్రతీ ఒక్కరూ భీమా సౌకర్యం కలిగి ఉండాలని తెలిపారు. రైతులందరూ పంట రుణం పొందేలా బ్యాంకులు సహకరించాలని కోరారు. ప్రతి ఇంటికి ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి వచ్చాయని, అందరూ కూడా సేవలు వినియోగించుకుని అడవి శ్రీరాంపూర్ గ్రామాన్ని డిజిటల్ పేమెంట్ గ్రామంగా తీర్చాలని కోరినారు.ఈ కార్యక్రమంలో నాబార్డ్ ప్రతినిధి, కేడిసిసి మేనేజర్, పోస్టల్ అధికారులు, పాల్గొన్నారు.

## మండల విద్యాధికారిగా బాధ్యతలు స్వీకరణ

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలోని మండల విద్యా వనరుల కేంద్రంలో బుధవారం నూతన మండల విద్యాధికారిగా చెరుకు రాజన్న బాధ్యతలు చేపట్టడం జరిగింది .ఇక్కడ పనిచేసిన బూస జమునా దేవి పదవి విరమణతో పోస్ట్ ఖాళీ కాగా విద్యాశాఖ ఆదేశాల మేరకు మండలంలోని ఇబ్రహీం నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న చెరుకు రాజన్న పదవి బాధ్యతలు ,చేపట్టగా మండలంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత ,ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు ఎంఈఓ కార్యాలయ సిబ్బంది శాలువాతో సత్కరించి పుష్పగుచ్చం అందజేసి అభినందనలు తెలియజేశారు .ఎం ఈ ఓ గా బాధితులు స్వీకరించిన చెరుకు రాజన్న మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతం ,నిరుపేద విద్యార్థులకు మెరుగైన విద్య అందించడమే లక్ష్యంగా పాఠశాలలలో నెలకొన్న సమస్యల సాధనకు కృషి చేస్తానని చెప్పారు .ఈ కార్యక్రమంలో ,ప్రధానోపాధ్యాయులు ,ఉపాధ్యాయులు ,వివిధ సంఘాల బాధ్యులు ,ఎం ఆర్ సి సిబ్బంది ,ఎల్ ఎఫ్ ఎల్ హెచ్ఎం లు ,వివిధ సంఘాల రాష్ట్ర బాధ్యులు మండల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సమ్మె వాల్ పోస్టర్స్ ను విడుదల చేసిన జెఏసి సంఘాల నాయకులు

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి:** కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జూలై 9 న జరిగే దేశ వ్యాప్త సమ్మె ను సింగరేణి లో జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్ లో సమ్మె వాల్ పోస్టర్స్ ను జేఏసీ సంఘాల నాయకులు విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్రం లోని బిజెపి ప్రభుత్వం మూడవ సారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని వారు విమర్శించారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్ లుగా విభజించడాన్ని వారు వ్యతిరేకించారు. ముఖ్యంగా నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, 44 కార్మిక చట్టాలను కొనసాగించాలని, సింగరేణి లో కొత్త గనులు ఏర్పాటు చేయాలని, మారుపేర్ల సమస్యను పరిష్కరించాలని, కార్మికుల కు స్వంత ఇంటి పథకం అమలు చేయాలని, కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలను అమలు చేయాలని, ప్రతి కార్మికుడికి రిటైర్డ్ ఐన తర్వాత కనీస పెన్షన్ 9వేలు చెల్లించాలని తదితర డిమాండ్ లను పరిష్కరించాలని కోరుతూ సింగరేణి యాజమాన్యం కు సమ్మె నోటీసు ను అందజేయడం జరిగిందని, కనుక సింగరేణి లో జూలై 9 న జరిగే దేశ వ్యాప్త సమ్మె ను జయప్రదం చేయాలని వారు కార్మికుల ను కోరారు. ఇంకా ఈ కార్యక్రమంలో జేఏసీ సంఘాలు ఏఐటియుసి, ఐఎన్టీయుసి, సిఐటియు, టిబిజికేఎస్ మరియు ఐఎఫ్టీయు సంఘాల నాయకులు మడ్డి ఎల్లా గౌడ్, మిర్యాల రాజిరెడ్డి, మెండె శ్రీనివాస్, కే.విశ్వనాథ్ తో తదితరులు పాల్గొన్నారు.



# వారాహి నవరాత్రి ఉత్సవాల్లో లక్ష పుష్పార్చన

**ప్రజాపక్షం/కోరుట:** జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో గణేశ నవదుర్గ మండలి ఆధ్వర్యంలో త్రిశక్తి మాత దేవాలయంలో వారాహి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా వారాహి మాతకు మంగళవారం రాత్రి లక్ష పుష్పార్చన ఘనంగా నిర్వహించారు. వారాహి నవరాత్రులు జూన్ 26 నుండి జూలై 4 వరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. వారాహి నవరాత్రుల ప్రత్యేకత ఏంటంటే శత్రువుల నుండి రక్షణ వారాహి దేవిని పూజించడం ద్వారా దుష్టశక్తుల నుండి రక్షణ లభిస్తుందని భక్తులు నమ్ముతారు. వారాహి దేవి అనుగ్రహంతో భక్తుల కోరిన కోరికలు నెరవేరుతాయని విశ్వసిస్తారు. ఆషాడమాసంలో వచ్చే నవరాత్రుల్లో భాగంగా జరుపుకుంటారని తెలిపారు. గణేశ్ నవదుర్గ మండలి ప్రధాన కార్యదర్శి గజ్జల శంకర్ మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల నుండి వారాహి దేవి నవరాత్రులు జరుపుతున్నామని కానీ ఈ సంవత్సరం విగ్రహం పెట్టి వారాహి పూజలు జరుగుతున్నాయని తెలిపారు. వారాహి మాత నవరాత్రులు జరుపుకోవడం కోరుట్ల పట్టణంలో ఇదే మొదటి సారి అని ప్రతిరోజు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. దసరా నవరాత్రులకు, వారాహి నవరాత్రులకు తేడా ఉంటుందని వారాహి నవరాత్రులను గుప్త నవరాత్రులు అంటారని, ఈమాతకు రాత్రివేళ పూజిస్తారని, వారాహి మాతకు రాత్రివేళ ధూపం, దీపం, నైవేద్యం, అభిషేకం, హోమం ఉంటాయని సూర్యాస్త సమయంలో పూజా కార్యక్రమాలు జరుపుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గణేశ నవదుర్గా మండలి గౌరవ అధ్యక్షులు కట్ట నారాయణ, అధ్యక్షులు కటుకం గణేష్, ప్రధాన కార్యదర్శి గజ్జల శంకర్, కోశాధికారి అదువాల ప్రభాకర్, కార్యవర్గ సభ్యులు గాజుల రమేష్, లక్మంపల్లి విజయ్, నవీన్, కార్యకర్తలు కటుకం గంగారాం, చింతకింది సత్యనారాయణ, కార్తీక్, ప్రవీణ్, రాము, కళ్యాణ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

# బిల్లుల కోసం లంచాలు అడిగితే ఫిర్యాదు చేయండి

**ప్రజాపక్షం/మల్లాపూర్:** ప్రభుత్వం నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇస్తుందని, నిర్మాణ సమయంలో ఎవరైనా బిల్లుల కోసం లంచాలు అడిగితే ఫిర్యాదు చేయాలని టీపీసీసీ నాయకులు జువ్వాడి కృష్ణారావు అన్నారు. ఈ సందర్భంగా బుధవారం గుండంపల్లి గ్రామంలో పలువురికి మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అంతడుపుల పుష్పలత నర్సయ్య, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు నాసం రాజా తిరుపతి, మాజీ సర్పంచులు భూపెల్లి దేవయ్య, మామిడి లక్ష్మారెడ్డి, స్థానిక నాయకులు ఉన్నారు.

# ఆసుపత్రిలో వైద్యుల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహణ

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి:** జూలై 8న ఉదయం 11 గంటలకు ప్రభుత్వ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్య పోస్టుల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నామని, ఆసక్తి అర్హత గల అభ్యర్థులు హాజరుకావాలని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో గల తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులలో ఖాళీగా ఉన్న 3 సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్, 1 సివిల్ అసిస్టెంట్ సర్జన్ (ఎంబీబీఎస్) పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేసేందుకు జూలై 8న జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నామని అన్నారు. ఆసక్తి గల వైద్యులు తమ యొక్క దరఖాస్తు బయోడేటా తో పాటు అన్ని విద్యార్హతల ఒరిజినల్ సర్టిఫికెట్ల తో పాటు జిరాక్స్ ప్రతులు ఒక సెట్ తో హాజరు కావాలని, జనరల్ సర్జరీ గైనకాలజిస్ట్, ఆర్థోపెడిక్స్ నిపుణులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వ బడుతుందని, సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్టులకు నెలకు లక్ష రూపాయలు, సివిల్ అసిస్టెంట్ సర్జన్లకు నెలకు 52,351 రూపాయల వేతనం ఉంటుందని, ఇతర వివరాలకు 949485396 నెంబర్ నందు సంప్రదించాలని జిల్లా ఆసుపత్రిసూపరింటెండెంట్ ప్రకటనలో పేర్కొన్నారు.

# ఫేస్ క్యాప్చర్,ఈ కేవైసి ద్వారా అవకతవకలకు ఆస్కారం ఉండదు

**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్:** జగిత్యాల ప్రాజెక్ట్ పరిధిలోని జగిత్యాల అర్బన్ లో బుధవారం రోజున అంగన్వాడి సెంటర్ లను సిడిపిఓ మమత సందర్శించారు. సందర్భంలో భాగంగా ఈ జూలై నెల నుండి పోషణ ట్రాకర్ లో లబ్ధిదారుల ఈ కేవైసి, ముఖ ధృవీకరణ తప్పనిసరి చేస్తూ పై అధికారులు ఆదేశాలు జారీ చెయ్యడం జరిగిందని అన్నారు. పట్టణంలోని అంగన్వాడి కేంద్రాలను సిడిపిఓ మమత సందర్శించి లబ్ధిదారుల ఫేస్ క్యాప్చర్, ఈ కేవైసి పరిశీలించడం జరిగింది. ఈగర్భిణిలు, బాలింతలు, 6 నెలల నుండి 5 సంవత్సరాల పిల్లలకు ఈ నెల నుండి ఫేస్ క్యాప్చర్, ఈ కేవైసి, అన్ని అంగన్వాడి సెంటర్ లలో 100 శాతం పూర్తి చెయ్యాలని సంబధిత అంగన్వాడి నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని జగిత్యాల సిడిపిఓ మమత అన్నారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లులు,ఆయాలు,లబ్ధిదారులు, పాల్గొన్నారు.

# ధర్నా చేసే ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్న పోలీసులు

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి:** దేశ ప్రయోజనాలను, ప్రతిష్టను అమెరికాకు తాకట్టు పెడుతున్న నరేంద్రమోదీ విధానాలపై ఉద్యమించాలని, భారతీయులపై అమెరికా దుర్మార్గపు చర్యలను ఆపాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) తెలంగాణ సమితి ఆధ్వర్యంలో ఛలో అమెరికా రాయబార కార్యాలయ ముట్టడి కార్యక్రమానికి పిలుపుఇస్తే రాష్ట్ర వ్యాప్తంగా పోలీసులు యువజన సంఘ నేతలను అక్రమంగా ఇళ్ళల్లోకి చొరబడి అరెస్ట్ చేయడాన్ని ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి తీవ్రంగా ఖండిస్తుందన్నారు.ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మార్కపురి సూర్య మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా గచ్చిబౌలి లో గల అమెరికా రాయబార కార్యాలయం దగ్గర శాంతియుతంగా ధర్నా చేసే ప్రయత్నం చేస్తున్న ఏఐవై నాయకత్వాన్ని పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యం హితంగా నిరసన తెలిపే హక్కులను సైతం ప్రభుత్వాలు కాలరాయడం సిగ్గుచేటని వారన్నారు. భారతీయ విద్యార్థులకు సంకెళ్లు వేసి యుద్ధ విమానాల్లో దొంగలగా ట్రంప్ ఈ దేశానికి ఆగ మేఘాల మీద పంపించినప్పటికీ నరేంద్ర మోడీ స్పందించకపోవడానికి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ప్రపంచానికి పెద్దన్న పాత్ర పోషిస్తున్న అంటూ దేశాలు తిరిగే నరేంద్ర మోడీ దేశ పౌరులకు ఆపద వస్తే అమెరికాతో కొట్లాడకపోగా కనీసం ప్రశ్నించే పరిస్థితుల్లో కూడా లేడని ట్రంప్ కు మోడీ ఒక తొత్తుల వ్యవహరిస్తున్నాడని విరుచుకుపడ్డారు భారత దేశంలో విద్యా వ్యవస్థలు సరియైన మౌలిక వసతులు కల్పించకపోవడం మూలంగానే విద్యార్థులు ఇతర దేశాలకు వెళ్లడం జరుగుతుంది అని విమర్శించారు. ట్రంపు మోడీ విధానాలు ఇలాగే కొనసాగితే ఈ విధానాలకు వ్యతిరేకంగా భవిష్యత్తులో జాతీయస్థాయిలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. అరెస్ట్ అయిన వారిలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆరేపల్లి మానస కుమార్, కల్లపల్లి నవీన్లు ఉన్నారు.




# మూర్మూరు నుంచి మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** మూర్మూరు నుంచి నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడిందని ఈఈ మిషన్ భగీరథ గ్రిడ్ పూర్ణ చందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూర్మూరు హెచ్.ఎం.డబ్ల్యూ.ఎస్.ఎస్.బి పంప్ హౌస్ ప్యానెల్ రూమ్లో గల మిషన్ భగీరథ ప్యానెల్ బోర్డులో సాంకేతిక సమస్య తలెత్తడం వలన జూలై 2 ఉదయం 9.45 గంటల నుంచి మిషన్ భగీరథ నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందని, మరమ్మత్తు పనులు జరుగుతున్నాయని, మరమ్మత్తు పూర్తి కాగానే నీటి సరఫరా పునరుద్ధరించబడుతుందని, అందరూ సహకరించాలని మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# వెంకట్రావుపేట్ శివారులో ఇసుక డంపు పట్టివేత

**ప్రజాపక్షం/మల్లాపూర్:** మండలంలోని వెంకట్రావుపేట గ్రామ శివారులో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా నిల్వచేసిన 20 ట్రిప్పుల ఇసుక డంపు పట్టుకున్నట్లు తాసిల్దార్ రమేష్ బుధవారం తెలిపారు. అదే విధంగా అనుమతి లేకుండా అక్రమంగా రవాణా చేస్తున్న ఇసుక ట్రాక్టర్ పట్టుకొని కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు. పర్మిషన్ లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# నాలుగు లేబర్ కోడ్ ల రద్దు కోసం సింగరేణి లో సమ్మె

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి:** కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జూలై 9 న జరిగే దేశ వ్యాప్త సమ్మె ను సింగరేణి లో జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం జికెకె 11వ ఇంక్లైన్ లో జరిగిన గేట్ మీటింగ్ లో జేఏసీ సంఘాల నాయకులు కార్మికుల ను కోరారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్రం లోని బిజెపి ప్రభుత్వం మూడవ సారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని వారు విమర్శించారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్ లుగా విభజించడాన్ని వారు వ్యతిరేకించారు. ముఖ్యంగా నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, 44 కార్మిక చట్టాలను కొనసాగించాలని, సింగరేణి లో కొత్త గనులు ఏర్పాటు చేయాలని, మారుపేర్ల సమస్యను పరిష్కరించాలని, కార్మికుల కు స్వంత ఇంటి పథకం అమలు చేయాలని, కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలను అమలు చేయాలని, ప్రతి కార్మికుడికి రిటైర్డ్ ఐన తర్వాత కనీస పెన్షన్ 9వేలు చెల్లించాలని తదితర డిమాండ్ లను పరిష్కరించాలని కోరుతూ సింగరేణి యాజమాన్యం కు సమ్మె నోటీసు ను అందజేయడం జరిగిందని, కనుక సింగరేణి లో జూలై 9 న జరిగే దేశ వ్యాప్త సమ్మె ను జయప్రదం చేయాలని వారు కార్మికుల ను కోరారు. ఇంకా ఈ కార్యక్రమంలో జేఏసీ సంఘాలు ఏఐటియుసి, ఐఎన్టీయుసి, సిఐటియు, టిబిజికేఎస్ మరియు ఐఎఫ్టీయు సంఘాల నాయకులు మడ్డి ఎల్లా గౌడ్, తుమ్మల రాజిరెడ్డి, వడ్డెపెల్లి శంకర్, కే.విశ్వనాథ్ లు పాల్గొని ప్రసంగించారు. ఇంకా ఈ సమావేశంలో జేఏసీ సంఘాల నాయకులు ఆరెల్లి పోషం, రంగు శ్రీను, నాయిని శంకర్, గొడిషల నరేశ్ తో పాటు పాల్గొన్నారు.



# శ్రీ దుబ్బ రాజేశ్వర స్వామిని దర్శించుకున్న డిఆర్డిఏ పిడి రఘువరన్

**ప్రజాపక్షం/సారంగపూర్:** జగిత్యాల జిల్లా సారంగపూర్ మండలం పెంబట్ల గ్రామంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ దుబ్బ రాజేశ్వరస్వామి వారిని బుధవారం జగిత్యాల జిల్లా డిఆర్డీఏ పిడి రఘువరన్ కుటుంబసభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. వేదపండితులచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారికి స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి, తీర్థప్రసాదం, చిత్రపటాన్ని ఆలయ సిబ్బంది అంజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీవో శ్రీలత, టిఏలు శివ, స్వప్న, పంచాయితీ కార్యదర్శి పల్లవి, ఫీల్డ్ అసిస్టెంట్ రాజు, ఆలయ సిబ్బంది, రజినీకాంత్, శివ, అర్చకులు మధు, కైలాసం తదితరులు పాల్గొన్నారు

# పారిశుద్ధ్య పనులను పరిశీలించిన కమిషనర్ రవీందర్

**ప్రజాపక్షం/కోరుట:** ప్రభుత్వ చేపట్టిన వందరోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా కోరుట్ల పట్టణంలోని పలు వార్డుల్లో పారిశుద్ధ్య పనులను కమిషనర్ రవీందర్ బుధవారం పరిశీలించారు. ఒకసారి వాడి పారేసే సింగిల్ యూస్ ప్లాస్టిక్ను వినియోగించవద్దని ప్రజలకు సూచించారు. వానాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. కాలువల్లో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలను జేసీబీతో తొలగించారు. కాలనీల్లో రోడ్ల ప్రక్కన పెరిగిన ముళ్ల పొదలు పిచ్చి మొక్కలను సిబ్బందిచే తొలగించి శుభ్రం చేయించారు . రోడ్లపై అక్కడక్కడ నిలువ ఉన్న నీరుని తొలగించి భవన నిర్మాణాల నుంచి వచ్చే వ్యర్థాలతో పూడ్చడం జరిగింది. అలాగే సింగిల్ యూస్ ప్లాస్టిక్ని వాడొద్దని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సానిటరి ఇన్స్పెక్టర్ రాజేంద్రప్రసాద్, అశోక్, జవాన్లు, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

# మట్టి తరలింపు ద్వారా 2 కోట్ల 44 లక్షల ఆదాయం

ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : మట్టి తరలింపు ద్వారా 2 కోట్ల 44 లక్షల ఆదాయం సంపాదించి సంబంధిత మండలాల్లో రోడ్లు, పాఠశాలల అభివృద్ధికి ఖర్చు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి జిల్లాలోని చెరువులో నుంచి ఇప్పటి వరకు 9 వేల 185 ట్రాక్టర్ ట్రిప్పుల మట్టి తరలింపు ద్వారా 2 కోట్ల 47 లక్షల 99 వేల 500 రూపాయల ఆదాయం లభించిందని అన్నారు. పెద్దపల్లి మండలంలోని చేతికుంట చెరువు, కల్వా చెరువు ద్వారా 330 ట్రాక్టర్ ట్రిప్పులు, సుల్తానాబాద్ మండలంలోని నారాయణపూర్ గ్రామం షానిగ కుంట ద్వారా 71 ట్రాక్టర్ ట్రిప్పులు, శ్రీరాంపూర్ మండలంలోని పందిళ్ళ గ్రామ చెరువు ద్వారా 1575 ట్రాక్టర్ ట్రిప్పులు, ఓదెల మండలం లోని కొలనూరు గ్రామంలోని అప్ప మయ్య చెరువు ద్వారా 2125 ట్రాక్టర్ ట్రిప్పులు, అలిమయ చెరువు ద్వారా 3713 ట్రాక్టర్ ట్రిప్పులు, ఇందుర్తి గ్రామంలోని ఊర చెరువు ద్వారా 1191 ట్రాక్టర్ ట్రిప్పులు, మంథని మండలం సూరయ్య పల్లి గ్రామం



లోని రెడ్డి చెరువు ద్వారా 180 ట్రాక్టర్ ట్రిప్పులు మొత్తం 9185 ట్రాక్టర్ ట్రిప్పులు మట్టి తరలించమని అన్నారు. మట్టి తరలింపు ద్వారా లభించిన ఆదాయంలో 2 కోట్ల 44 లక్షల రూపాయలతో మంథని, ఓదెల, పెద్దపల్లి, శ్రీరాంపూర్, సుల్తానాబాద్ మండలంలో అంతర్గత సిసి రోడ్లు, ప్రభుత్వ పాఠశాల మరమ్మత్తు పనులు, కేజీబీవీ లో అదనపు సౌకర్యం కల్పనకు వినియోగించి ఆ పనులు పూర్తి చేయడం జరిగిందని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ప్రాణదాత సుఖీభవ..

ప్రజాపక్షం / వేములవాడ టౌన్: ఆపదలో ఉన్న వారికి నేనున్నా అని స్పందించే వ్యక్తిత్వం తనది. ఆపదలో ఉన్నామంటే రక్తసంబంధికులే మాకెందుకులే అని అనుకునే ఈ రోజుల్లో కులంతో, మతంతో పని లేకుండా నేనున్నాననిధైర్యం చెప్పి వారికి తోడుగా ఉండి, కల్మషం లేని మనస్తత్వం మరియు మానవత్వం కలిగిన మహమ్మద్ నయీమ్‌ని అందరూ ఆయన అభినందించారు. ఒకటి, రెండుసార్లు కాదు ఏకంగా 55 సార్లు రక్తదానం చేసి ఎందరికో ప్రాణ బిక్ష పెట్టారు. బుధవారం రోజు కరీంనగర్‌లోని చల్మెడ నరసింహారావు హాస్పిటల్లో చందుర్తి మండల కేంద్రానికి చెందిన ఒక వివాహితకి అత్యవసరంగా బ్లడ్ అవసరం ఉన్నందున ఉదయం 4:00 గంటలకు తన సొంత బైక్ పై వర్షంలో తడుస్తూ వెళ్లి రక్తదానం చేశారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని యువత సమాజానికి తమ వంతు సహాయ సహకారాలు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## అత్యున్నత మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహం అందజేత

ప్రజాపక్షం/గొల్లపల్లి: ఉద్యోగరీత్యా ఏ ప్రాంతంలో స్థిరపడినా చిన్నప్పుడు చదువుకున్న పాఠశాలంటే అందరికీ ఓ మధుర జ్ఞాపకమే .జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని శంకర్రావుపేట గ్రామ వాస్తవ్యులు కీర్తిశేషులు ఎడమల ఎల్లారెడ్డి స్మారకార్థం ఆయన మనవడు ఎడమల భోజేందర్ రెడ్డి అమెరికాలో సాఫ్ట్ వేర్ ఇంజనీర్ గా పనిచేస్తున్న ఆయన తాను చదువుకున్న మల్లన్న పేట ఉన్నత పాఠశాల పై ఉన్న మమకారంతో గత సంవత్సరం 10వ తరగతి పరీక్షా ఫలితాలలో 544 మార్కులు సాధించి పాఠశాలలో మొదటి స్థానంలో నిలిచిన లక్కాకుల వైష్ణవికి 10 వేలు, 542 మార్కులతో రెండవ స్థానం సాధించిన చందనకు 5 వేలు రూపాయలు నగదు ప్రోత్సాహకంగా అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు యాళ్ళ అమర్నాథ్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల చదువుకు పేదరికం ఎప్పటికీ అడ్డుకాదని భోజేందర్ రెడ్డి అందించిన నగదు ప్రోత్సాహకం విద్యార్థులలో ఆత్మవిశ్వాసం నింపుతూ భవిష్యత్తులో తాము ఇంకా బాగా చదువుకోవాలనే కృషి పెరుగుతుందన్నారు. గత మూడు సంవత్సరాల నుండి భోజేందర్ రెడ్డి మల్లన్నపేట పాఠశాలలో పదవ తరగతిలో అత్యున్నత మార్కులు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు ఇదే విధంగా నగదు ప్రోత్సాహం అందిస్తున్నారని తెలిపారు.

ఈ సందర్భంగా భోజేందర్ రెడ్డికి వారి కుటుంబ సభ్యులకు పాఠశాల పక్షాన ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో శంకర్రావుపేట గ్రామ మాజీ సర్పంచ్ తిరుపతి రెడ్డి వారి బంధువులు మల్లారెడ్డి, కిషోర్, ఉపాధ్యాయులు కర్ణాకర్, రాజేశం, హరికృష్ణ, సత్య, రవీందర్, చంద్రశేఖర్,శరత్ చందర్, విజయ, ప్రకాష్, స్రవంతి, నందయ్య, రాజనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## హమాలీ కార్మికులు సార్వత్రిక సమ్మె


ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : జిల్లాలోని ఎఫ్సిఐ, సిడబ్ల్యుసి, ఎఫ్సిఐ గోదాములు మార్కెట్ యార్డులు రైల్వే గూడ్స్ షెడ్లు, రైస్ మిల్లులు, బజార్, వివిధ సంస్థలు స్థలాలలో బస్తా మోసే ప్రతి ఒక్క హమాలీ కార్మికుడు ఈనెల 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొని



విజయవంతం చేయాలని తెలంగాణ హమాలి వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు గుంటి సామ్రాజ్యం అన్నాడి వెంకట్ రెడ్డి లు పిలుపునిచ్చారు.బుధవారం జిల్లా కేంద్రంలోని పెద్దపల్లి రైల్వే గుడ్ షెడ్, రాఘవపూర్ జిఎంఆర్ గోదాములను సందర్శించిన తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు గుంటి సామ్రాజ్యం అన్నాడి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ హమాలీ కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో గత ప్రభుత్వాలు విఫలమయ్యాయని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా హమాలీ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు జంగా సంపత్, రైల్వే గూడ్ షెడ్ హమాలి నాయకులు మోహన్, శ్రీశైలం, రవి, వెంకటేష్, శ్రీనివాస్, రాజు, సంపత్, రాజ్ కుమార్, రాజేందర్ నాయకులు కామ భూమన్న, జిఎంఆర్ గోదాం నాయకులు చిప్ప రాజు, బొంగోని నరేష్, తిరుపతి గౌడ్, అధిక సంఖ్యలో హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

## పర్యావరణ్ కాంపిటీషన్ పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్

ప్రజాపక్షం/పెద్దపల్లిటౌన్:జిల్లాలో నేషనల్ స్టూడెంట్స్ పర్యావరణ పోటీ (ఎన్.ఎస్.పి.సి) 2025 పోస్టర్ పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ మార్పుల ప్రభావాల నుంచి రక్షణ కోసం విద్యార్థుల్లో పర్యావరణ నైపుణ్యాలు, ఆరోగ్యకరమైన జీవనశైలి అలవర్చుకోవడం అత్యంత అవసరమని, మొక్కలు నాటడం, నీటి సంరక్షణ, వ్యర్థాల వేరుచేయడం వంటి పద్ధతులు ప్రతి విద్యార్థికి అలవాటవ్వాలని పేర్కొన్నారు. ఈ పోటీని హరిత్ ద వే ఆఫ్ లైఫ్ అనే నినాదంతో పర్యావరణ సంరక్షణ అనే ఉద్దేశంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తోందన్నారు. ఈనెల 1 నుండి ఆగస్టు 21 వరకు రిజిస్ట్రేషన్లు అందుబాటులో ఉంటాయనీ, కేంద్ర విద్యా, పర్యావరణ మంత్రిత్వ శాఖల సహకారంతో ఈ



పోటీని నిర్వహిస్తున్నారని చెప్పారు. ఫలితాలు ఆగస్టు 30న విడుదల చేస్తామన్నారు.జిల్లాలోని అన్ని పాఠశాలలు, కళాశాలలు ఈ పోటీలో పాల్గొనాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా విద్యాధికారి డి. మాధవి, అకాడమిక్ మానిటరింగ్ అధికారి డాక్టర్ పిఎం షేక్, జిల్లా జాతీయ హరితదళం కోఆర్డినేటర్ గూళ్ళ అంజన్ కుమార్, జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్ సిహెచ్. మల్లేష్, జిసిడివో కవిత, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## గల్ఫ్ నుంచి జగిత్యాలకు చేరిన మృతదేహం

ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి: జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన రేవెళ్ల రవీందర్(57) ఉపాధి నిమిత్తం ఇజ్రాయిల్ గల్ఫ్ దేశానికి వెళ్లగా విధులు నిర్వర్తిస్తుండగా గత జూన్ నెల గుండెపోటుతో మరణించిన విషయం తెలిసిందే. మృతదేహం జగి



త్యాల పట్టణానికి తరలించడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎన్ఆర్ఐ వైస్ చైర్మన్ భీమ్‌రెడ్డి, జగిత్యాల ఎంఎల్‌సి సంజయ్‌కుమార్, తాజా మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ ఆడువాల జ్యోతిలక్ష్మి ణ్ తీవ్ర ప్రయత్నాలు చేసి కుటుంబ సభ్యులకు రవీందర్ మృతి దేహంఅప్పగించారు. జగిత్యాల తాజా మాజీ చైర్ పర్సన్ ఆడువాల జ్యోతిలక్ష్మణ్ దగ్గరుండి సంబంధిత ఎన్నారై అడ్వైజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి మాట్లాడి ఎర్ కార్గో వద్ద రవీంధర్ శవపేటిక స్వగృహంకు పంపించడం జరిగింది. మృతుడి బంధువులు ముష్మ కాళీకృష్ణ, భూమయ్య అంబటి ధీరజ్‌గౌడ్‌లు వెంట ఉన్నారు. దీంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. కాగా మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య, ఒక్క కూతురు, కొడుకు ఉన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి సంజయ్‌కుమార్ , మృతి చెందిన కుటుంబసభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆడువాల జ్యోతి మాట్లాడుతూ గల్ఫ్ దేశాలలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలను ఆదుకోవడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టిన రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా పథకం ఎందరికో ఉపయోగపడిందన్నారు. ఇజ్రాయిల్ మలేషియా, సింగపూర్, తదితర దేశాల్లో మృతి చెందిన వారికి కూడా 5 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ఆమె కోరారు. అంతిమ యాత్రలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ ఆడువాల జ్యోతిలక్ష్మణ్ పలువురు నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పౌష్టిక ఆహారం అందించేందుకు పటిష్ట చర్యలు

ప్రజాపక్షం/సుల్తానాబాద్ : ప్రతి యొక్క విద్యార్థిని విద్యార్థులకు పౌష్టిక ఆహారం అందించేందుకు ప్రభుత్వ సహకారంతో పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ గోల్డి బల్బీర్ కౌర్ అన్నారు. బుధవారం మోడల్ స్కూల్ పాఠశాల ఆవరణలో దాతల సహకారంతో పాటు తాను స్వయంగా కొంత డబ్బులు వెచ్చించి నిర్మించిన వంటగదిని ప్రిన్సిపల్ ప్రారంభించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులకు పౌష్టిక ఆహారాన్ని అందించేందుకు నూతనంగా పాఠశాలలో ఆవరణలో వంటగదిని దాతల సహకారంతో నిర్మించుకోవడం జరిగిందని అన్నారు. వంటగది నిర్మాణానికి సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కదాతకు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందంతోపాటు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## అగ్రహారం హనుమాన్ దేవాలయం ఆదాయం మూడు లక్షలు

ప్రజాపక్షం/వేములవాడ: వేములవాడ మండలం అగ్రహారం హనుమాన్ దేవాలయం లో నిర్వహించిన హుండి లెక్కించగా మూడు లక్షల ఎనభై ఏడు వేల ఎనిమిది వందల పదిహేడు రూపాయల ఆదాయం సమకూరినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నాగారం శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక వంశీయ ధర్మకర్త గొరిశెట్టి మహేందర్, జగిత్యాల డివిజన్ దేవాదాయశాఖ శ్రీనివాస్, ఆలయ సిబ్బంది, సత్య సాయి భక్త బృందం హుండీ కౌంటింగ్ లో పాల్గొన్నారు.

## గొల్లపల్లె లో గుడి పక్కనే మురికి కాలువ

ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ : ఎక్కడైనా ఆలయం ఉన్నచోట పక్కన ఓ రవి, వేప చెట్లో ఉంటుంది కానీ జగిత్యాల రూరల్ మండలం గొల్లపల్లె గ్రామంలో హనుమాన్ ఆలయం పక్కన పెద్ద మురికి కాలువ దేవుడికంటే ముందే ఆలయంకు వెళ్ళే భక్తులకు దర్శనం ఇస్తూ మురుగు వాసనతో ఆలయానికి వెళ్లి పూజలు నిర్వహించాల్సిన దుస్థితి ఉందని గొల్లపల్లె గ్రామ ప్రజలు తెలిపారు. ఈ మురికి కాలువ దుస్థితి చాలా సంవత్సరాలుగా ఇలానే ఉండి హనుమాన్ ఆలయం ముందు రోడ్డుపై మురికి నీరు పారుతూ ఉంటుందని ఆలయానికి, రోడ్డు గుండా వచ్చి వెళ్ళే భక్తులు, పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సంబంధిత అధికారులు స్పందించి వీలైనంత త్వరగా మురికి కాలువ నిర్మాణం చేపట్టి ఈ సమస్యకు పరిష్కారం చూపించాలని గొల్లపల్లె, పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి

ప్రజాపక్షం/సుల్తానాబాద్: సీజనల్ వ్యాధుల పట్ల సుల్తానాబాద్ పట్టణ ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేష్ అన్నారు.100 రోజుల ప్రణాళికలో భాగంగా బుధవారం సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని 2,13, 14వ వార్డు లను మున్సిపల్ కమిషనర్ తిప్పారాజు రమేష్ సందర్శించారు. సందర్శనలో భాగంగా పూసాలలో వాటర్ ట్యాంకులను పరిశీలించిన అనంతరం ట్యాంక్ పరిసరాల్లో ఉన్న పిచ్చి మొక్కలను సిబ్బందితో తొలగించి సమస్యను పరిష్కారం చేస్తారని కాలనీ వాసులకు తెలియజేశారు. రెండో వార్డు రజక నగర్,13వ వార్డు పూసాలలో పారిశుద్ధ్య పనులను పరిశీలించి, చెత్తను రోడ్లపై వేయకుండా తడి,పొడి చెత్తగా రెండు డబ్బాలలో వేరు చేసి వార్డులలోకి వచ్చే స్వచ్ఛ ఆటోలకు ఇవ్వాలని వార్డు ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ నాగరాజు,సిబ్బంది శ్రావణ్ కుమార్ ,శశి కుమార్, రాజకుమార్,భూమయ్య,పాల్గొన్నారు.

## షాపింగ్‌మాల్‌ను ప్రారంభించిన జీవన్‌రెడ్డి

ప్రజాపక్షం/జగిత్యాలటౌన్: జగిత్యాల పట్టణంలోని రాంబజార్ రోడ్‌లో కాసం ఫ్యాషన్ షాపింగ్ మాల్‌ను బుధవారం మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి ప్రారంభించారు. షాపింగ్‌మాల్ యాజమాన్యం కొత్త మోహన్ కుటుంబ సభ్యులకు ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు గాజుల రాజేందర్, మునిందర్, పాల్గొన్నారు.



## డయల్ 100 దుర్వినియోగం

**ప్రజాపక్షం / తాండూర్ :** అత్యవసర సేవల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు తాండూర్ పోలీసులు బుధవారం ఒకరిని బైండోవర్ చేశారు. అత్యవసర సేవల (డయల్ 100) నెంబర్ కు భంగం లేదా ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని తాండూర్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం, తాండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అచులాపూర్ గ్రామానికి చెందిన సైదాం మదునయ్య మద్యం మత్తులో ప్రతిరోజూ డయల్ 100 హెల్ప్‌లైన్‌కు అనవసర కాల్స్ చేస్తూ అత్యవసర సేవలకు ఆటంకం కలిగిస్తున్నాడు. పలుమార్లు స్థానిక పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చినా మదునయ్య ప్రవర్తనలో మార్పు రాలేదు. దీంతో బుధవారం అతడిని తహసిల్దార్ ముందు హాజరుపరిచి బైండోవర్ చేశారు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే డయల్ 100 నంబర్‌ను సద్వినియోగం చేసుకోవాలని, అనవసర కారణాలతో ఫోన్ చేయవద్దని పోలీసులు ప్రజలను కోరారు. అత్యవసర సేవల దుర్వినియోగంపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## కలమడుగు పల్లె దవాఖానకు యాదవ సంఘం చేయూత



**ప్రజాపక్షం/జన్నారం :** జన్నారం మండలం కలమడుగు గ్రామంలో ఇటీవల ప్రారంభమైన ప్రభుత్వ పల్లె దవాఖానకు కలమడుగు యాదవ సంఘం తమ ఉదారతను చాటుకుంది. బుధవారం యాదవ సంఘం ఆధ్వర్యంలో దవాఖానకు అవసరమైన ఒక ఫ్రిడ్జ్‌ను డాక్టర్ దుర్గం గంగాదేవికి అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గంగాదేవి మాట్లాడుతూ పల్లె దవాఖానకు ఫ్రిడ్జ్ అందజేసిన యాదవ సంఘానికి తమ కృతజ్ఞతలు తెలియజేశారు. దాతలు ముందుకు వచ్చి ఇలాంటి సహాయ సహకారాలు అందించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎంలు విశ్వాస, సులోచన, ఆశా వర్కర్లు సువర్ణ, శైలజతో పాటు యాదవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడికి శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** తెలంగాణ భారతీయ జనతా పార్టీ రాష్ట నూతన అధ్యక్షునిగా ఎన్నికైన ఎన్.రాంచందర్‌రావును మంచిర్యాల బిజెపి మాజీ అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం రఘునాథ్ రాష్ట్ర అధ్యక్షడు రాంచందర్‌రావును సత్కరించి మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

# మహిళల భద్రతే షీ టీం లక్ష్యం

### మంచిర్యాల షీ టీం ఇంచార్జ్ నరేష్



**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** సమాజంలో మహిళలకు భరోసా కల్పించడం, ప్రత్యేక భద్రత కల్పించడమే షీ టీం ప్రధాన లక్ష్యం అని మంచిర్యాల జిల్లా షీ టీం ఇంచార్జ్ ఇన్‌స్పెక్టర్ నరేష్ అన్నారు. బుధవారం నస్పూర్‌లోని సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థుల కోసం డ్రగ్స్, షీ టీం లపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ వల్ల వ్యక్తిగతంగా, సామాజికంగా జరిగే అనర్థాలతోపాటు, జిల్లాలో షీ టీం నిర్వహించే విధుల గురించి వివరించారు. అలాగే మానవ అక్రమ రవాణా, పోక్సో చట్టాలు, బాల్య వివాహాల పరిణామాలు, ఈవ్ టీజింగ్, టి సేఫ్ అప్లికేషన్, సోషల్ మీడియా, సైబర్ క్రైమ్స్, హెల్ప్‌లైన్ నెంబర్ 1930, డయల్ 100 ప్రాముఖ్యత వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎవరైనా డ్రగ్స్ సేవించినా, మహిళలను వేధించినా, డయల్ 100కు లేదా రామగుండం షీ టీమ్ నెంబర్ 6303923700కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా షీ టీం ఎస్ఐలు హైమ, ఉషారాణి, కానిస్టేబుల్స్ జ్యోతి, శ్రీలత, భరోసా సెంటర్ కోఆర్డినేటర్ విజయ, భరోసా సిబ్బంది, జిల్లా న్యాయ సేవ సమితి సభ్యులు, కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల పథకంతో నెరవేరుతున్న సొంతింటి కల



**ప్రజాపక్షం /కాగజ్‌నగర్ :** ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా పేదల సొంతింటి కలను నెరవేర్చడం కేవలం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని తాజా మాజీ మున్సిపల్ కౌన్సిలర్ పిర్సింగుల జయచందర్ అన్నారు. బుధవారం కాగజ్‌నగర్ పట్టణంలోని ఆరో వార్డులోని కాపువాడలో 32 మంది అర్హులైన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరైన పత్రాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిరుపేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ పథకంలో ఎవరైనా దళారులు అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇండ్లు లేని ప్రతి నిరుపేదకు ఇండ్లు మంజూరయ్యేలా కృషి చేస్తామని, దళారులను నమ్మి మోసపోవద్దని కాలనీ ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వార్డు ఆఫీసర్ నవీన్ కుమార్, హౌసింగ్ డిపార్ట్‌మెంట్ ఏఈ మహేష్, కాలనీ వాసులు, ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక చట్టాల రద్దుకు వ్యతిరేకంగా దేశవ్యాప్త సమ్మె



**ప్రజాపక్షం/మందమర్రి :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి 44 కార్మిక చట్టాలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్‌తో ఈనెల 9వ తేదీన దేశవ్యాప్త సమ్మెకు కార్మిక సంఘాల జెఎసి నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం మందమర్రి లోని ఎఐటియుసి కార్యాలయంలో జరిగిన పత్రికా సమావేశంలో జెఎసి నాయకులు మాట్లాడుతూ, బ్రిటిష్ కాలం నాటి చట్టాలను రద్దు చేసుకుని, ఎన్నో పోరాటాల ద్వారా 44 కార్మిక చట్టాలను సాధించుకున్నామని గుర్తు చేశారు. ఇప్పుడు బిజెపి ప్రభుత్వం ఆ 44 చట్టాలను రద్దు చేస్తూ, వాటిని నాలుగు కోడ్‌లుగా విభజించి, కార్మిక సంఘాలు, వేతన కమిటీలు లేకుండా చేసి కార్మికులను నిర్వీర్యం చేసే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే దేశవ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలు ఏకమై బిజెపి ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగడుతూ, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జూలై 9న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చాయని తెలిపారు. సింగరేణిలో సంఘటిత, అసంఘటిత కార్మికులు, ఓపెన్ కాస్ట్, ఓబీ కార్మికులు, మొత్తం సింగరేణి కార్మిక వర్గం ఈ సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కార్మిక సంఘాల జెఎసి నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, కాంపల్లి సమ్మయ్య, నాగరాజు గోపాల్, మేడిపల్లి సంపత్, రాములు, సత్యనారాయణ, మల్లేష్, సుదర్శన్, రమణ, బానయ్య, వెంకటేశ్వర్లు, శంకర్రావు, సూర్యనారాయణ, బిక్షపతి, వెంకటస్వామి, రామస్వామి, ఐలయ్య, వీరారెడ్డి తిరుపతి, అన్ని గనుల డిపార్ట్‌మెంట్‌ల ఫిట్ కార్యదర్శులు పాల్గొన్నారు.

# సమ్మె నేపథ్యంలో విస్తృత ప్రచారం చేపట్టిన సిఐటియు..



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** జూలై 9న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు మద్దతుగా సిఐటియూ (సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్)విస్తృత ప్రచారం చేపట్టింది.బుధవారం రోజు టిఎన్‌జిఓ భవనంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించబడింది.సిఐటియూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేష్ ఈ సమావేశానికి హాజరై,జూలై 9న జరగబోయే సమ్మెలో కార్మికులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సత్తా చాటాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,శతాబ్ద కాలంగా కార్మికవర్గం అనేక త్యాగాలు,పోరాటాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి,4 లేబర్ కోడ్స్‌ను తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోందని తెలిపారు.ఈ చర్యలు భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1),ఆర్టికల్ 21,24,39(డి) లకు విరుద్ధమని ఆయన స్పష్టం చేశారు.ఈ కొత్త లేబర్ కోడ్స్ అమలు జరిగితే కార్మిక సంఘాల ఏర్పాటు కష్టతరం అవుతుందని,కార్మికుల సమష్టి బేరసారాల శక్తి నిర్వీర్యం చేయబడుతుందని,సమ్మె హక్కును సైతం లేకుండా చేస్తుందని సురేష్ వివరించారు.దీని వల్ల ఉద్యోగ భద్రత,ఉపాధి భద్రత కూడా కోల్పోతారని,కార్మిక శాఖ కూడా నిర్వీర్యం చేయబడుతుందని కార్మిక సంఘాలు భావిస్తున్నాయని పేర్కొన్నారు.దేశంలోని పరిస్థితులను సమీక్షించిన కేంద్ర కార్మిక సంఘాలు,స్వతంత్ర ఫెడరేషన్లు,అసోసియేషన్లు వాస్తవానికి 2025 మే 24న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయని ఆయన గుర్తు చేశారు. మే 7న కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ సింధూరం నిర్వహించి పాకిస్తాన్ ఉగ్రవాద స్థావరాన్ని ధ్వంసం చేసిందని తెలిపారు.ఈ పరిణామాల నేపథ్యంలో దేశ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని, 2025 మే 20న జరగవలసిన సమ్మెను 2025 జూలై 9వ తేదీకి మార్పు చేసిందని సురేష్ వివరించారు.జూలై 9న జరిగే ఈ దేశవ్యాప్త సమ్మెను కార్మికులు పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని ఆయన మరోసారి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లలిత,జిల్లా కోశాధికారి శైలజ,యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శులు లావణ్య,రమ్య,భాగ్య,చంద్రకళ,ఉమా తదితరులు పాల్గొన్నారు.

# పదోన్నతి పొందిన గని మేనేజర్ భూ శంకరయ్యకు ఘన సన్మానం

**ప్రజాపక్షం /కాసిపేట :** మందమర్రి ఏరియాలోని కాసిపేట ఇంక్లైన్ గని మేనేజర్‌గా సమర్థవంతంగా పనిచేసి, మందమర్రి డివిజన్‌లోనే రక్షణ అధికారిగా పదోన్నతి పొంది బదిలీపై వెళ్తున్న గని మేనేజర్ భూ శంకరయ్యకు గని అధికారులు, యూనియన్ నాయకులు, వివిధ డిపార్ట్‌మెంట్‌ల ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. పూలమాలలు, శాలువాలతో ఆయనకు అభినందనలు తెలిపారు. ఫిట్ సెక్రటరీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, మేనేజర్ ఎప్పుడూ ఉద్యోగుల పక్షాన నిలబడి పని చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రక్షణ అధికారి నిఖిల్, డిప్యూటీ మేనేజర్ వెంకటేష్, ఎఐటియుసి సెంట్రల్ కమిటీ నాయకుడు చిప్ప నరసయ్య, బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్, ములుగు లక్ష్మీనారాయణ, ఫిట్, సేఫ్టీ కమిటీ సభ్యులు, ఇతర కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎపిఒ రజియా సుల్తానాకు డాక్టరేట్

**ప్రజాపక్షం/మందమర్రి :** మందమర్రి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎపిఒగా విధులు నిర్వహిస్తున్న రజియా సుల్తానా ప్రతిష్టాత్మకమైన గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు. ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ ఆమెకు ఈ గౌరవాన్ని ప్రదానం చేసింది. రజియా సుల్తానా సోషల్ సర్వీసులో చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ డాక్టరేట్‌ను పొట్టి శ్రీరాములు యూనివర్సిటీలో అందజేసినట్లు ఆమె తెలిపారు. డాక్టరేట్ పట్టా పొందిన ఎపిఒ రజియా సుల్తానాకు ఎంపిడిఓ రాజేశ్వర్ ఆధ్వర్యంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ విధులను నిర్వహిస్తూనే సేవా రంగంలో అద్భుతమైన కృషి చేసి గౌరవ డాక్టరేట్ పొందడం ఆమె సేవా నిరతికి నిదర్శనమని ఈ సందర్భంగా రాజేశ్వర్ రావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు కొమురయ్య, ఫిరోజ్, పంచాయతీ సెక్రటరీలు, కాంగ్రెస్ నాయకులు గందె రామ్ చందర్, ఎంపిఓ సత్యనారాయణ, ఎపిపిఎం ఇసి మధు, టిఎ రాజమల్లు, కుమార్, తిరుమల, ఫీల్డ్ అసిస్టెంట్ రాజేందర్, సత్యనారాయణ, ఫీల్డ్ అసిస్టెంట్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఈద లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# మంచిర్యాల పట్టణ ఆర్యవైశ్య సంఘం ఎన్నికల్లో రెండు నామినేషన్లు



**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** మంచిర్యాల పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష పదవి ఎన్నికల ప్రక్రియలో నామనేషన్ల పర్వం బుధవారం ప్రారంభం అయ్యింది. పట్టణ అధ్యక్ష పదవికి జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో స్థానిక వైశ్యభవన్‌లో నామినేషన్ల స్వీకరణ కార్యక్రమాన్ని ఎన్నికల అధికారులు నిర్వహించగా నిర్ణీత గడువులోగా రెండు నామినేషన్లు దాఖలు అయ్యాయి. ఇందులో కటుకం హరీష్, మరొకరు వుత్తూరి తిరుపతి లు తమ నామినేషన్లను ఎన్నికల అధికారులకు సమర్పించారు.

దశాబ్దం తర్వాత తెరుచుకున్న వేంపల్లి ప్రభుత్వ పాఠశాల

# ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య :డిఇఒ యాదయ్య

**ప్రజాపక్షం /హాజీపూర్ :** హాజీపూర్ మండలం వేంపల్లి గ్రామంలో గత పదేళ్లుగా మూతపడి ఉన్న ప్రభుత్వ పాఠశాలను బుధవారం జిల్లా విద్యాధికారి యాదయ్య పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమంతో సర్కార్ బడులను తిరిగి తెరవడం సంతోషంగా ఉందని అన్నారు. ఇప్పటివరకు ఈ పాఠశాలలో ఏడుగురు విద్యార్థులు చేరారని, మరి కొంతమంది చేరనున్నారని తెలిపారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులతో విద్య బోధన కేవలం ప్రభుత్వ పాఠశాలల్లోనే అందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు చౌదరి, సత్యనారాయణ, ఎంఇఓ తిరుపతిరెడ్డి, మండల నోడల్ ఆఫీసర్ హనుమాండ్లు, కాంప్లెక్స్ హెచ్ఎం సుధారాణి, ఉపాధ్యాయులు రేవతి తదితరులు పాల్గొన్నారు. వేంపల్లి పాఠశాల తిరిగి ప్రారంభం కావడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.




## బైంసాలో గ్రీవెన్స్ డే..

ప్రజాపక్షం/బైంసా : ర్మల్ జిల్లా పోలీస్ శాఖ ప్రజలకు మరింత చేరువయ్యేందుకు చేపట్టిన కార్యక్రమాల్లో భాగంగా,బుధవారం బైంసాలోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో గ్రీవెన్స్ డే నిర్వహించారు.జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ ఈ కార్యక్రమానికి హాజరై,బైంసా సబ్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి ఫిర్యాదులను స్వీకరించారు.ఫిర్యాదులను స్వీకరించిన అనంబతరం,ఎస్పీ వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు.బాధితులకు చట్టపరంగా అందాల్సిన సహాయాన్ని అందిస్తూ వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆమె సూచించారు. నిర్మల్ వరకు రావడం కష్టంగా ఉన్న వారికి బైంసాలోనే కౌన్సిలింగ్ లభించడం తమకు ఎంతో ఊరటనిచ్చిందని బాధితులు పేర్కొన్నారు.గ్రీవెన్స్ డేలో స్వీకరించిన ఫిర్యాదులలో ఇప్పటివరకు ఎన్ని పరిష్కారం అయ్యాయి.పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదుల పురోగతి ఎలా ఉందనే విషయాలపై ఎస్పీ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఫోటో 02 నిర్మల్ 07

## కరెంట్ షాక్ తో ఆవు-ఎద్దు మృతి..



ప్రజాపక్షం/తానూర్ : మండలంలోని ఝరి(బి) గ్రామ నివాసి గుర్ల శ్రీనివాస్ కు చెందిన ఒక ఆవు,ఒక ఎద్దు,తన సొంత చేసు కొట్టంలో విద్యుత్ షాక్‌తో మృతి చెందిన ఘటన బుధవారం ఝరి(బి) గ్రామంలో చోటు చేసుకుంది.మృతి చెందిన అవుఎద్దు విలువ సుమారు లక్ష రూపాయలు ఉంటుందని బాధితుడు తెలిపాడు.విద్యుత్ అధికారులు,ప్రభుత్వం స్పందించి,తనకు ఆర్థిక సహాయం చేయాలని ఆయన కోరారు.

## వాసవిక్లబ్స్ ఆధ్వర్యంలో ఘనంగా సిఎలు, వైద్యులకు సత్కారం



ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ : జాతీయ వైద్యులు, చార్టర్డ్ ఎకౌంటెంట్‌ల దినోత్సవంను పురస్కరించుకుని మంచిర్యాల వాసవిక్లబ్స్ ఆధ్వర్యంలో పలువులు సిఎలను, వైద్యులను ఘనంగా సన్మానించారు. మంచిర్యాల వాసవిక్లబ్, వనితాక్లబ్, కపుల్స్‌క్లబ్, టీచర్స్‌క్లబ్, బిజోన్ క్లబ్‌ల బాధ్యులు సంయుక్తంగా హైటెక్‌సిటీలోని కొంకుముట్టి వెంకటేశ్ నివాసంలో సిఎలను, వైద్యులను సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా సత్కారం పొందిన సిఎలు గడ్డం సూర్యప్రకాష్, రాచర్ల సాయిచరణ్, కొంకుముట్టి సాయప్రణీత్‌లు మాట్లాడుతూ, దేశ ఆర్థిక వ్యవస్థలో సిఎ పాత్ర కీలకమైందని సిఎలను సత్కరించడం అభినందనీయం అన్నారు. అలాగే సత్కారం పొందిన వైద్యులు డాక్టర్ నలుమాసు శ్రీదేవి, నలుమాసు శ్రీనివాస్, తాటిపెల్లి శ్రీధర్, జైన రామకృష్ణ, జైన సరిత, గోలి పూర్ణచందర్,. రావికంటి వంశీకృష్ణ, రావికంటి పవిత్ర, కండె కృష్ణ, చీకోటి శ్రీకాంత్, నిషాంత్‌లు మాట్లాడుతూ, నేటి సమాజంలో ఆహార అలవాట్లను మార్చుకుని ఎప్పటికప్పుడు కాలానుగుణంగా ఆరోగ్య రక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమాలలో వాసవిక్లబ్ జిల్లా క్యాబినెట్ సెక్రటరి సెవా కొంకుముట్టి వెంకటేశ్, వైఎస్ గవర్నర్ పుల్లూరి బాలమోహన్, అంతర్జాతీయ ప్రోగ్రాం కోఆర్డినేటర్ దొంతుల ముఖేష్, రీజియన్ ఛైర్మన్ కేశెట్టి వంశీకృష్ణ, సెక్రటరి నలుమాసు ప్రవీణ్, జిల్లా క్యాబినెట్ అధికారులు వుత్తూరి రమేష్, ఇరుకుల్ల శ్రీనివాస్, జోన్ ఛైర్మన్‌లు రావుల సత్యనారాయణ, మేడి లావణ్య, వాసవిక్లబ్ అధ్యక్షుడు కొత్త సురేందర్, వనితా క్లబ్ అధ్యక్షురాలు మల్యాల సంగీత, టీచర్స్ క్లబ్ అధ్యక్షుడు కాసం మల్లిఖార్జున్, బిజోన్ క్లబ్ అధ్యక్షురాలు నూక రమాదేవిలతో పాటు వాసవిక్లబ్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్‌లకు ట్యాబ్‌లు,కెమెరాల పంపిణీ..



ప్రజాపక్షం/బైంసా : నిర్మల్ జిల్లా పోలీస్ శాఖ డిజిటల్ యుగంలోకి అడుగులు వేస్తూ,పోలీస్‌లకు కొత్త దిశానిర్దేశం చేసింది.ప్రజల భద్రతకు సాంకేతికతను జోడించే లక్ష్యంతో,జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్‌కు నూతన ట్యాబ్‌లు,కెమెరాలు పంపిణి చేశారు.ఈరోజు బైంసాలోని క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలీస్ స్టేషన్‌లకు ఈ ఆధునిక పరికరాలను ఎస్పీ స్వయంగా అందజేశారు.నిత్యం పో లీసులు నిర్వహించే బ్లూ కోర్టు,100 డయల్ స్పందన,ట్రాఫిక్ చలాన్ల జారీ,రాత్రిపూట తిరిగే నేర అనుమానితుల ధృవీకరణ వంటి కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహించడానికి ఈ ట్యాబ్‌లు,కెమెరాలు, ఉపయోగపడతాయి.ఈ సందర్భంగా ఎస్పీ డా.జి. జానకి మాట్లాడుతూ,నేటి యుగంలో సాంకేతిక పరిజ్ఞానం ప్రతి రంగాన్ని శాసిస్తోందని,ముఖ్యంగా ప్రజల భద్రతకు నిత్యం పనిచేస్తున్న పోలీస్ విభాగం కూడా ఈ మార్పులకు అనుగుణంగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపిఎస్ తోపాటు ఇన్స్పెక్టర్లు గోపీనాథ్,మల్లేష్,ఎస్సైలు అశోక్,మహిళా ఎస్సై పెర్సిస్,ఆశోక్,శ్రీనివాస్,నవనీత్‌రెడ్డి,కృష్ణా రెడ్డి,మహిళా ఎస్సై సుప్రియ,హనుమండ్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


## నిర్మల్ లో ఘనంగా డాక్టర్స్ డే వేడుకలు..

### ప్రముఖ వైద్యులకు ఫ్రెండ్స్ హెల్పింగ్ సొసైటీ సన్మానం..



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :నిర్మల్ పట్టణంలో డాక్టర్స్ డే వేడుకలు ఉత్సవ్ బ్యాంక్వెట్ హాల్‌లో అంగరంగ వైభవంగా జరిగాయి.ఫ్రెండ్స్ హెల్పింగ్ సొసైటీ నిర్మల్ శాఖ ఆధ్వర్యంలో ప్రముఖ వైద్యులను ఘనంగా సన్మానించారు.ఈ వేడుకకు జిల్లా వైద్య సంఘం (ఐయంఎ) అధ్యక్షుడు డా.మురళీధర్ ముఖ్య అతిథిగా హాజరై వైద్యులు అందిస్తున్న సేవలను కొనియాడారు.సమాజానికి వైద్యులు చేస్తున్న కృషి అమూల్యమైనదని ఆయన ప్రశంసించారు.ఈ సందర్భంగా డా.ఉ.రామకృష్ణ,డా.కృష్ణంరాజు,డా.వేణుగోపాల కృష్ణ,డా.సుహాసిని,డా.సి.సంతోస్,డా.విద్యులతా,డా.వరుణ్,డా.సుజనితా,డా.చంద్రిక,డా.స్వప్న,డా.శ్రావంతి,డా.సచిన్,డా. ప్రియాంక తదితరులతో సహా పలువురు ప్రముఖ వైద్యులు వారందరికీ శీల్డులు అందించి,సమాజ సేవకు గాను కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ఫ్రెండ్స్ హెల్పింగ్ సొసైటీ అధ్యక్షులు అన్సార్ పాషా,మహిళా అధ్యక్షురాలు శోభారాణితో పాటు సభ్యులు జున్ను అనిల్,భీమయ్య,హరికృష్ణ, పాయం శంకర్,తుమ్మల దేవ్ రావు,ము రాద్,రా జు, రంజిత్,హెర్మోన్,శ్యాం ప్రకాష్,సింగర్ నాగరాజు,మమత,బంటి,టిఎన్‌జీఓ తదతరులు పాల్గొన్నారు.

## కేంద్ర కార్మిక వ్యతిరేక విధానాలపై దేశవ్యాప్త సమ్మెతో గుణపాఠం చెప్పాలి



ప్రజాపక్షం /శ్రీరాంపూర్ : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా జూలై 9న అన్ని కార్మిక సంఘాల పిలుపు మేరకు దేశవ్యాప్తంగా జరగబోయే సమ్మెలో సింగరేణి కార్మికులు పాల్గొని కేంద్రానికి గుణపాఠం చెప్పాలని కార్మిక సంఘాల జెఎసి నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం శ్రీరాంపూర్‌లోని ఉపరితల గనిలో ఏర్పాటు చేసిన ద్వార సమావేశంలో ముఖ్య అతిథులుగా హాజరైన నాయకులు మాట్లాడారు. స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి కార్మికులు అనేక పోరాటాలు, ప్రాణత్యాగాల ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా విభజించి, కార్మికులను కేవలం పని యంత్రాలుగా మార్చి కట్టు బానిసలుగా చేసే ప్రయత్నాలకు కేంద్ర ప్రభుత్వం పాల్పడుతోందని వారు మండిపడ్డారు. 8 గంటల పని దినాలను 12 గంటలుగా మార్చడానికి, దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి ప్రైవేట్ పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉండే విధంగా చట్టాలను మార్చడానికి ప్రయత్నిస్తున్నారని వారు ఆరోపించారు. ఈ చట్టాల ద్వారా జాతీయ సంపదలైన బొగ్గు గనులను కూడా ప్రైవేటీకరణ చేయడానికి, బ్యాంకింగ్, ఎల్ఐసి, రవాణా తదితర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేసేలా చట్టాలను రూపొందించారని అన్నారు. భవిష్యత్తులో కార్మికుల మనుగడ కొనసాగాలంటే కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకువస్తున్న 4 లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని కార్మిక వర్గమంతా కేంద్రాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో సింగరేణి కార్మిక వర్గమంతా స్వచ్ఛందంగా పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జెఎసి నాయకులు, ఎఐటియూసి రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె.బాజీ సైదా, ఐఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి ఏనుగు రవీందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు జెట్టి శంకర్రావు, జీవన్ జోయల్, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల రాజారెడ్డి, చంద్రశేఖర్, టిబిజికెఎస్ రాష్ట్ర అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు బండి రమేష్, ఐఎఫ్‌టిటియు రాష్ట్ర అధ్యక్షులు విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్యాలయంలో ఎ.ఒ.కి ఆర్‌టిఐ చట్టాల బుక్ అందజేత..

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : సమాచార హక్కు చట్టం పరీక్షల కమిటీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ హైదర్,నిర్మల్ జిల్లా అధ్యక్షుడు సి.హెచ్.వినోద్ ఈ రోజు నిర్మల్ మున్సిపల్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(ఏ.ఓ) సమాచార హక్కు చట్టాల బుక్‌ను అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,సమాచార హక్కు చట్టం(ఆర్‌టిఐ) ప్రజలందరికీ అందుబాటులో ఉండాలని,ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకతను పెంచడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.ఆర్‌టిఐ చట్టంపై అవగాహనకల్పించడం,దాని అమలును పర్యవేక్షించడం తమ కమిటీ ప్రధాన లక్ష్యమని వారు పేర్కొన్నారు.

## స్థానిక పోరుకు సిద్ధంగా ఉండాలి..



ప్రజాపక్షం/నేరడిగొండ : నేరడిగొండ మండలంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో బోథ్ ఇంచార్జ్ ఆడే గజేందర్,మాట్లాడుతూ నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్లకు బూతు స్థాయి నాయకులకు స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ శ్రేణులు సిద్దంగా ఉండాలని దిశా నిర్దేశం చేశారు.ప్రజా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను బూత్ స్థాయి కార్యకర్తల వరకు తీసుకెళ్లాలని అభిదవృద్ధి ద్యేయంగా ప్రచారం నిర్వహించి స్థానిక సంస్థలలో మన సత్తాను చాలాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆయా మండలాల కన్వీనర్లు బూత్ స్థాయి నాయకులు పార్టీ కార్యకర్తలు యువజన నాయకులు బద్దం పోతారెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి..



ప్రజాపక్షం/తానూర్ : గ్రామాలలో ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని,బుధవారం మండల కేంద్రమైన గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణంలో గ్రాను ప్రజలకు సైబర్ నేరాలు పిల్లలపై వాటి ప్రభావం అనే అంశంపై తానూర్ పోలీస్ శాఖ సిబ్బంది.ప్రజలకు అవగాహన నిర్వహించారు.ఈ సందర్భంగా హెచ్ సీ ఖాదర్,అమర్నాథ్,మాట్లాడుతూ..ప్రస్తుత సమాజంలో సైబర్ క్రైమ్ విపరీతంగా పెరిగిందని,పిల్లల పై ప్రభావం ఎక్కువగా ఉందని,ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని,కొత్త వ్యక్తులు ఎవరు ఫోన్ చేసినా వారికి వ్యక్తిగత విషయాలు చెప్పకూడదని,ప్రతి ఒక్కరూ హెల్ప్ లైన్ 100ను వినియోగించుకోవాలని,అదేవిధంగా సైబర్ క్రైమ్ జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని,ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని,వాహనాలు సంబంధించిన సరైన పత్రాలను,తమ వెంట ఉంచుకోవాలని,వారు అన్నారు.ఈ కార్యక్రమంలో పోలీస్ కాన్స్టేబుల్ కిరణ్,సాయినాథ్,గ్రామ ప్రజలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులను ఆదుకోవాలి..

ప్రజాపక్షం/బైంసా : బైంసా పట్టణంలోని వ్యవసాయ శాఖ ఏడిఐ వీణ మేడం రైతుల తరపున మెయోరండం ఇవ్వడం జరిగినది రైతులు కు ఎరువులు సక్రమంగా రావడం లేదు ప్రైవేట్ వ్యాపారస్తులు అధిక ధరలకు విక్రయిస్తున్నారు.డి.ఏ.పి యూరియా స్టాక్ లేదు సొసైటీలో కూడా స్టాక్ రావట్లేదు దయచేసి రైతుల తరపున వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ తోటరాము విన్నవించారు.ఈ కార్యక్రమంలో రైతులు యువకులు పాల్గొన్నారు.



## సహకార సంఘానికి కంప్యూటర్ విరాళం

**ప్రజాపక్షం/బోధన్:** అంతర్జాతీయ సహకార సంఘాల వారోత్సవాల సందర్భంగా బోధన్ మండలంలోని మినార్ పల్లి గ్రామ ప్రాథమిక సహకార సంఘంలో బుధవారం అంతర్జాతీయ వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా డిసిఓ శ్రీనివాస్ రైతులను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం క్రిబ్ కో కంపెనీ వారు కంప్యూటర్, చైర్స్ ను సహకార సంఘానికి విరాళంగా అందచేశారు. ఈ కార్యక్రమంలో సంఘం చైర్మన్ రవీంద్రబాబు, బోధన్ క్లస్టర్ ఇన్‌ఛార్జి రవీందర్, క్రిబ్ కో మేనేజర్ నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

**ప్రజాపక్షం/మోర్తాడ్:** నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలోని బాలికల ప్రాథమిక పాఠశాలలో బుధవారం విద్యార్థులకు నోటు పుస్తకాలు, వర్క్ బుక్కులను మోర్తాడ్ స్థానిక బాలికల ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలరాజు, రమణాచారి, సాగర్, నరసింహామూర్తి, సిఆర్‌పిలు సాయిరాం, సురేష్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## దోమల నివారణకు మందుల పంపింగ్

**ప్రజాపక్షం/మోర్తాడ్:** నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలో మోర్తాడ్ గ్రామ పంచాయతీ సిబ్బంది దోమల నివారణ కొరకై గ్రామంలోని మురికి కాలువలు వెంబడి ఆయా వీధులలోని సీసీ రోడ్ల వెంబడి దోమలు చేరకుండా మందులను పంపింగ్ చేస్తున్నారు. గ్రామంలో మలేరియా, డెంగ్యూ లాంటివి ప్రబలకుండా ముందు జాగ్రత్తగా గ్రామ పంచాయతీ కార్యదర్శి సైఫోద్దీన్, గ్రామ పంచాయతీ సిబ్బందితో వాడవాడలా బ్లీచింగ్ పౌడర్ వేస్తూ మురికి కాలువల వెంబడి ఉన్న గడ్డి, పిచ్చి మొక్కలపై మందులను పిచికారి చేస్తున్నారు. అలాగే దోమల నివారణ కొరకు ఆయా వాడలలో మురికి కాలువల వెంబడి దోమల నివారణకు ముందస్తుగా మందులను పిచికారి చేస్తున్నారు.

# 4న హైదరాబాద్‌కు ఎఐసిసి అధ్యక్షుడు ఖర్గే..



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** ఈ నెల 4వ తేదీన ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే హైదరాబాద్‌కు రానున్నారని పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జ్ రామ్ భూపాల్ తెలిపారు.నిర్మల్ జిల్లా కేంద్రంలోని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరి రావు నివాసంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు.రాష్ట్రంలో పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఖర్గే పర్యటన సాగుతుందని రామ్ భూపాల్ పేర్కొన్నారు.బూత్ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ నియమించిన కార్యవర్గ బాధ్యులతో నిర్వహించే కీలక సమావేశంలో ఖర్గే పాల్గొంటారని తెలిపారు.ఈ సమావేశంలో పార్టీ సంస్థాగత బలోపేతం,భవిష్యత్ కార్యాచరణ,ప్రజల్లోకి ప్రభుత్వ పథకాలను తీసుకెళ్లే విధానాలపై చర్చించనున్నట్లు సమాచారం.తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఈ సందర్భంగా రామ్ భూపాల్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.తద్వారా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయ దుందుభి మోగించాలని ఆయన ఆకాంక్షించారు.అలాగే,ప్రతిపక్ష పార్టీలైన బీఆర్ఎస్,బీజేపీ చేస్తున్న నిరాధార ఆరోపణలను సమర్థవంతంగా తిప్పికొట్టాలని,ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరించాలని కోరారు. ఈ మీడియా సమావేశంలో పిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంబడి రాజేశ్వర్,మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్ రెడ్డి,నిర్మల్ జిల్లాలోని వివిధ మండలాల కాంగ్రెస్ అధ్యక్షుడు పాల్గొన్నారు.ఖర్గే పర్యటన పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపుతుందని,రాబోయే ఎన్నికలకు పార్టీని సన్నద్ధం చేస్తుందని కాంగ్రెస్ నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# గల్ఫ్ బాధితులకు బిజెఎల్‌పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అండ



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** గల్ఫ్ దేశాలలో ఉపాధి నిమిత్తం వెళ్లి సమస్యల్లో చిక్కుకున్న నిర్మల్ జిల్లా వాసుల కుటుంబాలకు బిజెఎల్‌పి నేత,ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి,అండగా నిలిచారు.ఇటీవల చోటుచేసుకున్న మూడు వేర్వేరు ఘటనల్లో ఆయన బాధితుల పక్షాన కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను,సంబంధిత అధికారులను సంప్రదించి త్వరితగతిన సహాయం అందించాలని కోరారు.మృతదేహం స్వదేశానికి రప్పించేందుకు కృషి నర్సాపూర్ మండలం టెంబూర్ని గ్రామానికి చెందిన 36 ఏళ్ల బొగుడమీది సంతోష్ ఉపాధి నిమిత్తం గల్ఫ్‌కు వెళ్లి అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు.ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే స్పందించి,సంతోష్ మృతదేహాన్ని స్వదేశానికి రప్పించేందుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.విదేశాంగ శాఖ,రాష్ట్ర ఎన్ఆర్ఐ సెల్ అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా మృతదేహాన్ని స్వదేశానికి చేర్చాలని విజ్ఞప్తి చేశారు.దుబాయ్ లో చిక్కుకున్న వ్యక్తిని స్వదేశానికి రప్పించే ప్రయత్నం మామడ మండలం పరిమండల్ గ్రామానికి చెందిన గొర్రె రాజేందర్ దుబాయ్‌లో చిక్కుకుపోవడంతో ఆయన కుటుంబ సభ్యులు,మండల నాయకులు ఎమ్మెల్యే దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు.రాజేందర్‌ను స్వదేశానికి తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం,విదేశాంగ శాఖ,రాష్ట్ర ఎన్ఆర్ఐ సెల్ అధికారులతో మాట్లాడి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు.సౌదీ అరేబియాలో తప్పిపోయిన వ్యక్తి ఆచూకీ కోసం విజ్ఞప్తి నిర్మల్ పట్టణంలోని మంజులాపూర్ కు చెందిన పన్నాల శ్రీనివాస్ అనే వ్యక్తి సౌదీ అరేబియాలో తప్పిపోయారు.కుటుంబ సభ్యులు, స్థానిక నాయకులు ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా,ఆయన తక్షణమే విదేశాంగ శాఖ,కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ ఎన్ఆర్ఐ సెల్ అధికారులతో మాట్లాడారు.శ్రీనివాస్ ఆచూకీ కనుగొనేందుకు గాలింపు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.ఈ సంఘటనలు ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి నియోజకవర్గ ప్రజల సమస్యలపై చూపిస్తున్న శ్రద్ధను,గల్ఫ్ బాధితులకు అండగా నిలబడుతున్న తీరును స్పష్టం చేస్తున్నాయి.

# రైతుల సమస్యలు త్వరగా పరిష్కరించాలి



**ప్రజాపక్షం/నిజాంసాగర్:** రెవెన్యూ సదస్సు ద్వారా రైతులు విన్నవించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి నిజాంసాగర్ తహసీల్దార్ భిక్షపతిని ఆదేశించారు. నిజాంసాగర్ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆమె బుధవారం తనిఖీ నిర్వహించారు. రెవెన్యూ దరఖాస్తులను పరిశీలించి నిజాంసాగర్‌లో జరిగిన రెవెన్యూ సదస్సులకు 1195 మంది రైతులు దరఖాస్తు చేసుకోగా వారిలో 306 మందికి నోటీసులు అందించామని, మరో 87 మందికి ఇంకా నోటీసులు అందించవలసి ఉందన్నారు. అదేవిధంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరుగుతున్న పనుల తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట తహసీల్దార్ భిక్షపతి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ సాయిలు, సీనియర్ అసిస్టెంట్ విజయ్, సర్వేయర్ శ్రీకాంత్ తదితరులున్నారు.

# 45 రోజుల్లోగా పనులు ప్రారంభించకపోతే ఇందిరమ్మ ఇళ్లు రద్దు...

ఎంపిడివో బ్రహ్మానందం

**ప్రజాపక్షం / ఆర్మూర్ :** తెలంగాణ ప్రభుత్వం పేదల సొంతింటి కల సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇండ్లు పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. మొదటి విడతలో ఆర్మూర్ మండలంలోని 479 ఇండ్లను మంజూరు చేసింది. ఇందులోమార్క్ చేసినవి 232 (ముగ్గు పోసినవి), మార్కు చేయనివి 247. మార్కు చేసినవి ఇండ్లు వెంటనే ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించాలని ఎంపిడివో బ్రహ్మానందం లబ్ధిదారులకు విజ్ఞప్తి చేశారు. అయితే కొందరు ఇల్లు మంజూరైనప్పటికి నిర్మాణ పనులు ఇంకా మొదలుపెట్టలేదు. ఇలాంటి వారు 45 రోజుల్లోగా పనులు మొదలుపెట్టాలని, ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన వారికి మంజూరు పత్రాలను కూడా ప్రభుత్వం ఇప్పటికే అందించిందన్నారు. అందులో ఒక షరతు కూడా స్పష్టంగా ఉంది. మంజూరుపత్రంలో ఉన్న తేదీ నుంచి 45 రోజుల్లోగా ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించకపోతే ఇల్లు రద్దవుతుందని ఆయన తెలిపారు. కాబట్టి ఇల్లు మంజూరైన వారు తేదీ చెక్ చేసుకుని గడువు ముగియక ముందే నిర్మాణం చేపట్టాలి. ఇల్లు కట్టుకునేవరికి నాలుగు విడతల్లో రూ. 5 లక్షలు అందుతుందని కూడా మంజూరు పత్రంలో ఉంది. బేస్మెంట్ పనులు పూర్తయిన తర్వాత రూ. లక్ష, గోడలు పూర్తయిన తర్వాత రూ. లక్ష, శ్లాబ్ పూర్తయిన తర్వాత రూ. 2 లక్షలు, ఇంటి నిర్మాణం మొత్తం పూర్తయిన తర్వాత రూ. లక్ష విడుదలవుతాయని ఆయన అన్నారు. అలాగే నిర్మించే ఇల్లుకు కచ్చితంగా ఒక వంటగది, మరుగుదొడ్డి కలిగి ఉండాలన్నారు. ప్లాస్టరింగ్‌పనులు కూడా పూర్తి కావాలి. అప్పుడే ఇల్లు పూర్తయినట్టు పరిగణిస్తారు. మొత్తం రూ. 5 లక్షల సాయం అందుతుంది. ఈ డబ్బులను ప్రతి దశలోనూ నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోనే జమ చేస్తారని ఎలాంటి మధ్యవర్తుల ప్రమేయం ఉండదని, బ్యాంకు ఖాతా ఆధార్‌తో లింకు అయి ఉండేలా లబ్దిదారులు చూసుకోవాలని కొందరు ఇండ్లు మంజూరైన వెంటనే నిర్మాణ పనులు చేపట్టారు. మంచి రోజులు కాదని, లేదా ఇతర కారణాల వల్ల ఇంటి నిర్మాణ పనులు వాయిదా వేసుకోవద్దని ఎంపిడివో లబ్దిదారులకు విజ్ఞప్తి చేశారు. ఇంటి నిర్మాణం 400 చదరపు అడుగులు విస్తీర్ణము తగ్గకుండా 600 చదరపు అడుగులకు మించకుండా ఆర్‌సిసి స్లాబ్‌తో నిర్మించుకోవాలని బ్రహ్మానందం తెలిపారు. ఎల్ 1 అంటే ప్లాట్ ఉంటే ఇల్లు కట్టించడం, ఎల్ 2 అంటే ప్లాట్‌లేని వాళ్ళు, ఎల్ 3 అంటే ఇన్ ఎలిజిబుల్‌గా అయితారని ఆయన తెలిపారు.

# 9న జరిగే సార్వత్రిక సమ్మెలో పాల్గొందాం

అంగన్వాడి జిల్లా అధ్యక్షురాలు దేవగంగా



**ప్రజాపక్షం/మోర్తాడ్:** ఈ నెల 9న జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేద్దామని అంగన్‌వాడీ టీచర్స్, అండ్ హెల్పర్స్, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సిఐటియు జిల్లా నాయకురాలు దేవగంగా పిలుపునిచ్చారు. బుధవారం నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలో అంగన్‌వాడీ ఆశ వర్కర్లతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న చట్టాలను కేంద్ర ప్రభుత్వం కుదించటాన్ని నిరసిస్తూ దేశ వ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్, ఆశ వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు, గ్రామ పంచాయతీ కార్మికులు, బీడీ కార్మికులు సమ్మెకు పిలుపునివ్వడం జరిగిందని, అందువల్ల జూలై 9న జరిగే సమ్మెలో అన్ని రంగాల కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్మికులకు కనీసం నెలకు 26వేలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమ్మెను విజయవంతం చేయటానికి మండల సమన్వయ కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. కన్వీనర్‌గా జ్యోతి, కో కన్వీనర్‌గా శాంతి, మజీద్ సభ్యులుగా శారద, హరిక, ప్రేమలత లను ఎన్నుకోవడం జరిగింది. ఈ సమావేశంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు జ్యోతి, చంద్రకళ, జమున, అనురాధ, సమత తదితరులు పాల్గొన్నారు.

## ఆలయంలో చోరీ నిందితుడికి రిమాండ్

**ప్రజాపక్షం/ భీమ్‌గల్:** కమ్మర్‌పల్లి మండలంల ఉప్లూర్ గ్రామంలో గత నెల 30వ తేదిన ఎల్లమ్మ ఆలయంలో జరిగిన దొంగతనం చేసిన వ్యక్తిని బుధవారం నాడు పట్టుకున్నట్లు ఎస్ఐ అనిల్ రెడ్డి తెలిపారు.ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం కరీంనగర్ జిల్లా కోత్తపల్లి మండలం రేకుర్తికి చెందిన తూర్పాటి కనకయ్య గత కోన్ని నెలలుగా ఆలయాలలో దోగతనం చేస్తున్నట్లు తెలిపారు మండలంలోని ఉప్లూర్‌లోని ఎల్లమ్మ ఆలయం,పెద్దమ్మ గుడి,ఎర్గట్ల మండలంలోని తోర్తిలోని శుక్రవారం దేవి ఆలయంతోపాటు మండల కేంద్రంలోనిగుండ్లకుంట హనుమాన ఆలయంలో దొంగతనాలు చేసినట్లు నిందితుడు ఒప్పుకున్నాడని ఎస్ఐ తెలిపారు.నిందితుడిని ఆర్మూర కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ ఓ ప్రకటనలో తెలిపారు.దోంగతనం కేసును చేదించడంలో కృషి చేసిన ఐడి పార్టీ కానిస్టేబుల్ షౌకత్‌అలీ,నవీన్‌చంద్ర,వినయ్‌లను సిఐ పోన్నం సత్యనారయణ గౌడ్ ఈసందర్బంగా అభినందించారు.

## బాధిత కుటుంబాల పరామర్శ

-రాష్ట్ర కోఆపరేటివ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి

**ప్రజాపక్షం/భీమ్‌గల్:** రాష్ట్ర కో అపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్,డిసిసి అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి బుదవారం ఎర్గట్ల మండలంలోని పలు భాధిత కుటుంభాలను ఆయన పరామర్శించారు.తడపాకల్‌కు చెందిన జింక అన్వేష్,కుటుంబాన్ని పరామర్శించారు.ఈయన వెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సోమ దేవరెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గంగాప్రసాద్,మాజీ జడ్పిటిసి గుళ్ళే రాజేశ్వర్,రేండ్ల రమేష్,ఎండి మూనీర్,సంజీవ్ తదితరులు ఉన్నారు.

## బదిలీపై వచ్చిన భీమ్‌గల్ నూతన ఎస్ఐకి సన్మానం

**ప్రజాపక్షం/భీమ్‌గల్:** ఇటీవల బదిలీపై భీమ్‌గల్‌కు వచ్చిన ఎస్ఐ సంజీవ్‌ను బుధవారం నాడు మండల బిజెపి నాయకులు శాలువాతో సన్మానించి నోట్‌బుక్స్,పెన్నులను అందజేశారు.పోలీస్‌శాఖకు బిజెపి తరుపున అన్ని విధాల సహాయసహకారాలు ఉంటాయని బిజెపి నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల బిజెపి పార్టీ అధ్యేఉడు ఆరే రవీంధర్,రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నర్సయ్య,బిజెవైఎం నాయకులు అశోక్,రాయకృష్ణ,మోహన్,వెంకటేష్,హరిప్రసాద్,నారాయణరెడ్డి,దేవేందర్,సునీల తదితరులు ఉన్నారు.



# వరి నాట్లకు కూలీల కొరత

### యుపి, బీహార్, కలకత్తా కూలీలే దిక్కు

**ప్రజాపక్షం / నందిపేట్ :** పొలం పనులు చేయడానికి మండలంలో కూలీల కొరత ఉంది. అందుకే యుపి, బీహార్, కలకత్తా కూలీలతో రైతులు పనులు చేయించుకుంటున్నారు. రైతులకు వీరే దిక్కుగా మారింది. ఇంతకుముందు వరి నాట్లు వేసిన గ్రామ కూలీలు ఇప్పుడు బయటకు రాలేక పోతున్నారు. అనారోగ్య సమస్యలతో పనులు మానుకుంటున్నారు. డాక్టర్ల సలహాను పాటించడం ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు. కొత్తగా పెళ్లయిన కోడళ్లు చదువుకొని ఉండడంతో చాలా మంది బీడీ పరిశ్రమ, ప్రయివేటు ఉద్యోగాలు, అల్లిక, కుట్టు మెషిన్‌కు అలవాటు పడడంతో వ్యవసాయం కూలి పని పట్ల శ్రద్ధ చూపడం లేదు. అందుకే రైతులు వేరే రాష్ట్రాల నుంచి వస్తున్న కూలీలే దిక్కు. బీహార్, ఉత్తర ప్రదేశ్, కలకత్తా, నల్గొండ నుంచి కూలీలను తీసుకువచ్చి వరి నాట్లు వేసుకుంటున్నారు. ఎకరం పొలం నాట్లు వేస్తే రూ. 4500 నుంచి 4600 వరకు తీసుకుంటున్నారు. అందుకే కూలీల కొరత తీరుతుంది. వీరు లేకుంటే చాలా మంది రైతులు ఆందోళన చెందవలసి వచ్చేది. కలుపునకు కలుపు నివారణ మందులు రైతులు పిచికారి చేస్తున్నారు. కోత సమయంలో కోత మెషిన్‌లు వాడుతున్నారు. అందుకే సమస్య అంతగా లేదు. వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి.

# ఆర్యవైశ్య సమాజానికి క్షమాపణ చెప్పాలి




**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** ఆర్యవైశ్యులకు రాజకీయ రంగు అంటగడుతూ కించపర్చేలా మాట్లాడిన అర్వపల్లి పురుషోత్తం గుప్తా వర్గం తక్షణమే ఆర్యవైశ్యులకు క్షమాపణ చెప్పాలని ఆర్యవైశ్య పట్టణ సంఘం అధ్యక్ష అభ్యర్థి ధన్‌పాల్ శ్రీనివాస్‌గుప్తా అన్నారు. ఆర్యవైశ్య పట్టణ సంఘం ఎన్నికల సందర్భంగా అధ్యక్ష పదవికి పోటీ చేస్తున్న ధన్‌పాల్ శ్రీనివాస్ గుప్తా బుధవారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆర్యవైశ్య పట్టణ సంఘానికి ఒక ఘనమైన చరిత్ర ఉందని, ఆర్యవైశ్య కుటుంబాల అభివృద్ధే లక్ష్యంగా సేవే పరమావధిగా నిర్ణయం తీసుకుని తమ ప్యానల్ సభ్యులు పట్టణ సంఘం ఎన్నికలలో పోటీ చేస్తున్నామన్నారు. తమ ప్యానల్ సంఘ బాధ్యతలు స్వీకరిస్తే ప్రధానంగా పెట్టుకున్న లక్ష్యాలైన అర్హులైన పేద వైశ్యులకు 10 లక్షల యాక్సిడెంట్ బీమా అండ్ ఉచిత మెడికల్ క్యాంప్‌ల నిర్వహణ, ప్రస్తుతం 50 మందికి ఇస్తున్న 500 ల పెన్షన్‌ను అర్హులైన పేద ఆర్యవైశ్యులందరికి అందేలా కృషి చేస్తాం. పురుషోత్తం గెలిస్తే ఆర్యవైశ్య సమాజినికి ఏమి చేస్తారో చెప్పే క్లారిటీ లేక సంఘ ఎన్నికలకు రాజకీయ రంగు రుద్దాలని చూస్తున్నాడని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాజకీయ నాయకులు సంఘం ఎన్నికల్లోకి ఎందుకు వస్తున్నారు ? వారికి ఎందుకు గులగుల ? వారికి ఫ్యూచర్ ఉండదనే అనవసరమైన ప్రసంగం చేయడం చూస్తే ఆయనకు ఓటమి భయం పట్టుకుని మతి తప్పి గతి లేని మాటలు మాట్లాడుతున్నాడని ఆరోపించారు. పురుషోత్తంగుప్తాకి సూటిగా ప్రశ్నిస్తున్న అంటూ రాష్ట్రవ్యాప్తంగా మన వైశ్య కమ్యూనిటీలో రాజకీయాలలో ఉన్నది ఇద్దరే ఇద్దరు డైనమిక్ లీడర్స్ ఒకరు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, మరొకరు బిగాల గణేష్‌గుప్తా లో ఎవరిని ఉద్దేశించి మాట్లాడుతున్నారో స్పష్టం చేయాలన్నారు. ఆర్యవైశ్య సమాజం ఇప్పుడిప్పుడే రాజకీయంగా చైతన్యమవుతుంటే అది చూసి ఓర్వలేక యావత్ మన ఆర్యవైశ్య సమాజాన్ని కించపర్చే మాటలు మాట్లాడటం తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆర్యవైశ్య సోదరీమనులందరూ వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని మా ప్యానల్‌కు ఒక అవకాశమిచ్చి ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్ష పదవికి ఎన్నుకున్నట్లయితే ఇలా మాటలలో కాకుండా చేతలలో తన వంతు సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఇల్లెందుల ప్రభాకర్‌గుప్తా, లాభిశెట్టి శ్రీనివాస్ గుప్తా, పెద్ది జగదీశ్వర్‌గుప్తా, పబ్బ రాజగుప్తా, బరుడువార్ అనిల్‌గుప్తా, వీరమల్లి రమేష్‌గుప్తా, రాజాప్రతాప్‌గుప్తా, ప్యానల్ సభ్యులు పాల్గొన్నారు.

# దుర్గమ్మ జాతరకు ఏర్పాట్లు

### పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జయప్రకాశ్ రెడ్డి




**ప్రజాఫక్షం /సంగారెడ్డి ప్రతినిధి:** సంగారెడ్డి పట్టణంలో అతి పురాతనమైన మహా శక్తివంతమైన దుర్గమ్మ జాతర ఏర్పాట్లకై పిసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జయప్రకాశ్‌రెడ్డి ఆద్వర్యంలో జాతర ఏర్పాట్లకు ప్రారంబమయనాయి. అందులోన భాగంగా బుదవారం నాడు జాతర ఏర్పట్లు పరిశీలనకై నిర్మల జగ్గారెడ్డి గుడి యొక్క ఆయల కమిటీతో మాట్లాడడం జరిగింది. ఈ నెల 16 వ తారీఖు నుంచి 21 వ తారీఖు వరకు దుర్గమ్మ తల్లి జాతర ,బోనాలు, కలవని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుడి ఆలయ పూజారి నాగరాజు ,తోపాజీ అనంతకృష్ణ ( టీసీసీసీ రాష్ట్ర ప్రదాన కార్యదర్శి) కిరణ్ గౌడ్, కూన సంతోష్, శ్రీకాంత్‌గౌడ్, మహేశ్ , గంగెడి శ్రీహరి వవన్ సందీప్ యాదగిరి తో పాటు గుడి ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నాలుగు లేబర్ కోడ్స్ రద్దుకై జూలై 9న సార్వత్రిక సమ్మె

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఓమయ్య




**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** పెట్టుబడిదారుల ప్రయోజనం కోసం కార్మికవర్గాన్ని బలిచ్చే నాలుగు లేబర్ కోడ్ల రద్దుకై జూలై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేద్దామని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఓమయ్య అన్నారు. బుధవారం స్తానిక సిఐటియు కార్యాలయంలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓమయ్య, సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్, టియుసిఐ జిల్లా ప్రదాన కార్యదర్శి సుధాకర్, ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు మల్లికార్జున్, ఐఎఫ్‌టియు జిల్లా సహాయ కార్యదర్శి శివలు మాట్లాడుతూ జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెను ప్రజలు, కార్మిక వర్గం జయప్రదం చేయాలని, సమ్మెకు సన్నాహాక కార్యక్రమంగా జూలై 5న బైక్ ర్యాలీ ప్రెస్‌క్లబ్ నుండి నెహ్రూ పార్కు వరకు ఉంటుందన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని, పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కార్మిక వర్గాన్ని బలిచ్చేందుకు తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర, కార్మిక సంఘాలు, ఫెడరేషన్లు, అసోసియేషన్లు సమ్మెకు పిలుపునిచ్చాయి. దేశమంతటా పూర్తిస్తాయిలో లేబర్ కోడ్లు అమలుపరిచి యూనియన్ల రిజిస్ట్రేషన్ల ను ప్రభుత్వం చేయనుందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల మంత్రివర్గ సమావేశంలో 8 గంటల పని దినాన్ని 10 గంటల పని దినంగా మార్చిందన్నారు. కార్మిక హక్కులను నిర్వీర్యం చేసి, కార్మిక చట్టాలను సరళతరం చేయడం, కార్మిక సంఘాలులేని బారతదేశాన్ని పెట్టుబడిదారులు, కార్పొరేట్ శక్తులకు బహుమానంగా ఇవ్వడం కేంద్ర బిజెపి ప్రభుత్వం యొక్క ప్రధాన ఉద్దేశమన్నారు. సమావేశంలో అన్ని కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# వృత్తి రీత్యా మెరుగుపడాలి...

### పోలీసు కమిషనర్ పి.సాయి చైతన్య

**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** వృత్తిపరంగా మారుతున్న కాలానికి అనుగుణంగా చట్టాలను, సైన్స్ను ఇన్వెస్టిగేషన్ టూల్‌గా మార్చుకొని తమను తామె మెరుగుపరుచుకుని ఉత్తమ ప్రతిభ కనబరచాలని నిజామాబాద్ పోలీసు కమిషనర్ పి. సాయి చైతన్య అన్నారు. బుధవారం కమిషనరేట్ లో జోన్ 2 బాసర లెవల్ పోలీసు డ్యూటీ మీట్ 2025 కార్యక్రమం ప్రారంభించారు. నిజామాబాద్, జగిత్యాల్, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలు పోలీసు డిపార్టుమెంటులో పోటీలు నిర్వహించారు. ఈ ఎంపికలు మూడురోజుల పాటు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పోటీలలో మంచి ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్ర స్తాయిలో జరిగే డ్యూటీ మీట్ కార్యక్రమానికి పంపడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ అదనపు డిసిపి (అడ్మిన్) బస్వారెడ్డి, అదనపు డిసిపి (ఎఆర్) రాంచందర్‌రావు, సిసిఎస్ ఏసిపి నాగవేంద్ర చారి, జగిత్యాల్, నిజామాబాద్, నిర్మల్, ఆదిలాబాద్ సిఐల, ఏఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్యల పరిష్కారానికి సిజిఆర్ఎఫ్

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :**విద్యుత్ సమస్యల పరిష్కారానికి సిజిఆర్ఎఫ్ వేదికగా వారి సమస్యలను పరిష్కరించుకోవాలని ఏడిఈ వినోద్ ఓ ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమానికి సిజిఆర్ఎఫ్2 చైర్మన్ నారయణ అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహిచడం జరుగుతుందన్నారు. ఈ నెల నాల్గవ తేది శుక్రవారం నాడు విద్యుత్ ఉప కేంద్రంలో భీమ్‌గల్,వేల్పూర్ మండలాల విద్యుత్ వినియోగదారలు అవకాశాన్ని వినియోగంచుకోవాలని కోరారు.ఈ కార్యక్రమానికి సిజిఆర్ఎఫ్ సభ్యులు రామకృష్ణ,కిషన్,రాజాగౌడ్,డిఈ రాజేశ్వర్,ఏలు తతదితరలు పాల్గోంటారని తెలిపారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో పురోగతి సాధించాలి

-కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి
-సీజనల్ వ్యాధుల నియంత్రణ
వనమహోత్సవం, ఎల్ఆర్ఎస్ అనుమతులుపై అధికారులకు దిశానిర్దేశం



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** పేదకుటుంబాలకు స్వంతింటి కలనుసాకారం చేయాలనే కృతనిశ్చయంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో పురోగతి సాధించాలని కలెక్టర్ టి. వినయ్‌కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన ఆర్మూర్ మున్సిపాలిటీని సందర్శించి పట్టణంలో అమలవుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, వనమహోత్సవం, సీజనల్ వ్యాధుల నియంత్రణ కోసం చేపడుతున్న ముందస్తు చర్యలు, ప్లాట్ల క్రమబద్ధీకరణ దరఖాస్తుదారులకు అనుమతుల మంజూరు తదితర అంశాలపై అధికారులతో సమీక్ష జరిపారు. ఒక్కో వార్డు వారిగా ఆయా అంశాలలో ప్రగతిని సమీక్షించిన కలెక్టర్, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలలో ప్రగతి ఆశించిన స్థాయిలో లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. 617 మందికి ఇళ్లను మంజూరు చేయగా కేవలం 183 మాత్రమే గ్రౌండింగ్ జరిగాయని అధికారులు, వార్డు ఆఫీసర్ల పనితీరును ఆక్షేపించారు. పరిస్థితి ఇలాగే ఉంటే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల లక్ష్యాన్ని ఎలా సాధిస్తారని నిలదీశారు. అసలత్వ వైఖరిని వీడాలని, ఇకనైనా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఇళ్లను నిర్మించుకునేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలని సూచించారు. అవసరమైతే ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యుల సహకారం తీసుకోవాలన్నారు. ఇల్లు మంజూరైన ప్రతిఒక్కరూ నిర్మాణం చేపట్టేలా అవసరమైన తోడ్పాటునందించాలని ఏవైనా ఇబ్బందులు ఉంటే వాటిని పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. పచ్చదనాన్ని పెంపొందిస్తూ పర్యావరణాన్ని పరిరక్షించేందుకు వీలుగా ప్రభుత్వం పెద్ద ఎత్తున నిఉలను వెచ్చిస్తూ చేపడుతున్న వనమహోత్సవంకార్యక్రమం విజయవంతమయ్యేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని కలెక్టర్ హితవు పలికారు. నర్సరీల్లో మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉండాలని, వాటిని నాటి పరిరక్షించేలా అనువైన ప్రాంతాలను గుర్తించాలని సూచించారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ముందుజాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. నివాస ప్రాంతాల నడుమ ఖాళీ ప్రదేశాలలో నిల్వ నీరు ఉండకుండా చూడాలన్నారు. దోమల వ్యాప్తిని నిరోధించేందుకు మురికి గుంతలలో ఆయిల్‌బాల్స్ వేయాలని, మంచినీటితో కూడిన వనరులలో గంబుషియా చేప పిల్లలు వదలాలని సూచించారు. ప్రతి శుక్రవారం అన్ని నివాస ప్రాంతల్లో వ్యాపార వాణిజ్య సంస్థలలో విధిగా డ్రైడే పాటించేలా చూడాలన్నార. ఎక్కడైనా మలేరియా, వషజ్వరాలు వంటి పాజిటివ్ కేసులు నమోదైతే పరిసర ప్రాంతాల్లో దోమల నివారణ మందులు పిచికారి చేయించాలని స్థానికుల బ్లడ్ శాంపిల్స్ సేకరించి వ్యాధినిర్ధారణ పరీక్షలు జరిపించాలని, అవసరమైన వారికి చికిత్సలు అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పోర్టల్‌లో లబ్ధిదారుల వివరాలు వెంటాదివెంట అప్‌డేట్ చేయాలన్నారు. సమీక్ష అనంతరం కలెక్టర్ ఆర్మూర్ పట్టణంలోని 11, 12 వార్డులలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులను వారిని నివాసాల వద్దకు వెళ్లి కలిసారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు ఏమైనా ఇబ్బందులున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. మంజూరి లభించినందున వెంటనే పనులు ప్రారంభించాలని హితవు పలికారు. ఆర్థిక ఇబ్బందులు వంటి సమస్యలుంటే మెప్మా ద్వారా రుణం ఇప్పిస్తామని, ఉచితంగా ఇసుక సరఫరా చేయిస్తామని, ఆయా దశల నిర్మాణాలను బట్టి వెంట వెంటనే రూ.5లక్షల ఆర్థిక సాయం ప్రభుత్వం అందిస్తోందని సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా మలేరియా నియంత్రణ విభాగం అధికారి డాక్టర్ తుకారం రాథోడ్, ఆర్మూర్ మున్సిపల్ కమీషనర్ రాజు తదితరులున్నారు.